ప్రతి నిత్యం తాజా సమాచారంతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేశిస్తూ ముస్తాబయి మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక




ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

Publisher&Editor: 9391690609,Office :7893003409

aksharamtsnews@gmail.com https//www.facebook.com/aksharamnewspaper/

www.aksharamtelugudaily.com

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం తెలుగు దినపత్రిక

ఆదివారం 19 మే 2024 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా

పేజీలు : 12 సంపుటి : 07 సంచిక : 59 వెల : రూ.3/- కొత్తగూడెం తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## అనుమతి ఇవ్వని ఈసీ.

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా



● 2లో

## బ్యారేజీలపై క్యాబినెట్‌లో చర్చిస్తాం: రేవంత్

-బ్యారేజీల అధ్యయనం, మరమ్మతులు ఏకకాలంలో!
-నెలలో పూర్తి చేద్దామంటున్న అధికారులు
-మూడు బ్యారేజీల బాధ్యత 3 కేంద్ర సంస్థలకు
-రేవంత్ నేతృత్వంలోని భేటీలో నిర్ణయం
-రిపేర్ల ఖర్చు నిర్మాణ సంస్థలే భరించాలి
-సర్టిఫికెట్లిచ్చినా నిర్మాణం పూర్తికానట్లే లెక్క
-సీఎం స్పష్టీకరణ.. వారంలో కాళేశ్వరానికి
-రేవంత్ నేతృత్వంలోని భేటీలో నిర్ణయం
-మరమ్మతు ఖర్చు నిర్మాణ సంస్థలదే
-అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టీకరణ



హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)

: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థితిగతులపై ఏకకాలంలో మూడు కేంద్ర సంస్థలతో అధ్యయనం చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మేడిగడ్డ బ్యారేజీని ఢిల్లీకి చెందిన కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం(సీఎసఎంఆర్ఎస)తో, అన్నారం బ్యారేజీని పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస)తో, సుందిళ్ల బ్యారేజీని హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ)తో అధ్యయనం చేయించనున్నారు. బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనే దానిపై ఈ మూడు సంస్థలతో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయించాలని సూచిస్తూ జె.చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎసఏ) నిపుణుల కమిటీ ఇటీవలే నివేదిక ఇచ్చింది. నివేదికపై శనివారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు చర్చించారు. ఇతర మంత్రులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. మధ్యంతర నివేదికలో ఏమేం సిఫారసులున్నాయి? బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలేంటి? ప్రభుత్వం చేపట్టాల్సిన



మిగతా 2లో..

## ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

బాలురదే హవా..ఇంజనీరింగ్ లో టాప్ 10 లో ఒక్క బాలికకే చోటు

అగ్రి,ఫార్మశీలలో సైతం బాలురదే పై చేయి

తెలంగాణ సెట్ ఎపి విద్యార్థులదే జోరు

● 2లో




## ప్రీమియం మేమే చెల్లిస్తాం..

రైతులపై భారం పడనివ్వం : మంత్రి సీతక్క



● 2లో

## టీఎస్ నుంచి టీజీగా మార్పు




● 2లో

హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర కోడ్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చాలని ప్రభుత్వం అన్ని శాఖలకు ఆదేశాలను జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు కార్యాలయాలు తమ సంస్థల పేర్లను టీజీగా మార్చుకున్నాయి.

## కళ్యాణలక్ష్మి పథకానికి రూ.725 కోట్లు విడుదల..



● 2లో

## తెలంగాణకు కావలసింది అధికార స్వరాలు కాదు..

# ధిక్కార స్వరాలు : కేసీఆర్

హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)

ఈరోజు తెలంగాణకు కావలసింది అధికార స్వరాలు కాదు.. ధిక్కార స్వరాలు.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలు అని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ఖమ్మం నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ కేటీఆర్ ట్వీట్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి హన్మకొండ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. ప్రతిష్టాత్మక బిట్స్ పిలానిలో విద్యాభ్యాసం చేశారు. మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్‌లో డ్యూయల్ మాస్టర్స్ డిగ్రీ పొందారు. అమెరికాలో ఏడేళ్ల పాటు పలు అంతర్జాతీయ కంపెనీల్లో ఉద్యోగం చేసిన రాకేష్ రెడ్డి.. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారని తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డి

అద్భుతమైన వాగ్ధాటి, పోరాట పటిమ, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం కలిగిన రాకేష్ రెడ్డి..



మిగతా 2లో..

## బహిరంగ చర్చకు నేను రెడీ..

# కానీ మోదీ రారు: రాహుల్

వివిధ అంశాలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మరోసారి ప్రధాని మోదీకి సవాలు విసిరారు. చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కానీ ప్ర?ధానే ముందుకు రాకపోవచ్చని అన్నారు.

బహిరంగ చర్చకు నేను రెడీ.. కానీ మోదీ రారు: రాహుల్

న్యూఢిల్లీ, మే 18: వివిధ అంశాలపై బహిరంగ చర్చకు రావాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం మరోసారి ప్రధాని మోదీకి సవాలు విసిరారు. చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, కానీ ప్ర?ధానే ముందుకు రాకపోవచ్చని అన్నారు.

ఢిల్లీలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ "ప్రధాని కోరుకున్న సమయంలో కోరుకున్న చోట చర్చలకు రెడీ ఉన్నా. అయితే ఆయన వస్తారని అనుకుంటున్నారా? నాకు తెలుసు.. ఆయన రారు. ఎందుకంటే నేను అడిగే మొదటి ప్రశ్న..అదానీతో ఉన్న మీకున్న సంబంధం ఏమిటని? ఇది అడుగుతాను కాబట్టే ఆయనకు ఇష్టం ఉండదు" అని అన్నారు.



## రేవంత్.. హామీలను నెరవేర్చలేరు

ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్‌కు..

ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గుడ్ బై

రాష్ట్రంలో ప్రత్యామ్నాయం మేమే: కిషన్‌రెడ్డి



● 2లో

# బ్యారేజీలపై క్యాబినెట్‌లో చర్చిస్తాం: రేవంత్

తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. బ్యారేజీల అధ్యయనంతో పాటు రిపేర్లు ఏకకాలంలో చేపట్టాలని నిర్దేశించారు. సమాంతరంగా చేపట్టడం వల్ల నాలుగు వారాల్లోగా మరమ్మతులు, పరీక్షలు పూర్తవుతాయని అధికారులు చెప్పారు. పరీక్షలపై నోడల్ అధికారిగా నీటి పారుదల శాఖలోని డిజైన్ల విభాగం చీఫ్ ఇంజనీరును నియమించాలని శనివారం నాటి సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకొని, వెనువెంటనే అధ్యయనం చేసేలా చూడాలని నిర్దేశించారు. ఆనకట్టల భద్రత జాతీయ సంస్థ నివేదిక ప్రకారం మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. బ్యారేజీల మరమ్మతుల బాధ్యత నిర్మాణ సంస్థలదేనని స్పష్టం చేశారు. 2019 జూన్‌లో మూడు బ్యారేజీలు ప్రారంభం కాగా... అదే సంవత్సరం వచ్చిన వరదలకు బ్యారేజీలు దెబ్బ తిన్నాయని, 2019 నవంబరులోనే లోపాలు బయట పడ్డాయని నీటిపారుదల శాఖ అధికారులు సీఎంకు నివేదించారు. బ్యారేజీల నిర్మాణం పూర్తి కాకముందే పూర్_్తయినట్లు సర్టిఫికెట్లు జారీ చేశారని, ఆ సర్టిఫికెట్లు చెల్లుబాటు కావని, బ్యారేజీలు పూర్తి కానట్లుగానే పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు సీఎంకు నివేదించారు. పూర్తయిన ఆర్నెల్లకే లోపాలు బయట పడినందున వాటిని సరి చేయాల్సిన బాధ్యత నిర్మాణ సంస్థలదేనని, లోపాలు బయట పడినప్పుడే ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులు చేసి ఉంటే ఈ సమస్య వచ్చేదే కాదని అధికారులు చెప్పారు. పునరుద్ధరణ/మరమ్మతుల ఖర్చు నిర్మాణ సంస్థలు భరించాల్సిందేనని సీఎం స్పష్టం చేశారు.

వారం రోజుల్లో కాళేశ్వరం పంపుల వద్దకు
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి(మేడిగడ్డ), సిరిపురం(అన్నారం), కాసిపేట(సుందిళ్ల) పంప్‌హౌసలను పరిశీలించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలను పరిశీలించినప్పటికీ పంప్‌హౌసలను మాత్రం పరిశీలించలేదు. బ్యారేజీల్లో నీటిని నిల్వచేస్తే పంప్‌హౌసలు పంపింగ్‌కు అనుకూలంగా ఉన్నాయా? లేవా? అనేది వారం రోజుల్లో జరిగే పర్యటనలో ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు.

మరో నెల రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్నందున ఈలోగా తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బ్యారేజీలను రిపేర్లు చేయా లా? ప్రత్యామ్నాయాలు ఏమైనా ఉన్నాయా? మరింత నష్టం జరగకుండా ఏమేం చర్యలు చేపట్టాలనేది నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. శనివారం మంత్రివర్గ సమావేశం జరగకపోవడంతో ఎన్‌డీఎసఏ నివేదికలోని కీలకమైన అంశాలపై చర్చించలేక పోయామని చెప్పారు.

సుందిళ్ళ ఖాళీ!
ఐదు గేట్లు ఎత్తి నీటి విడుదల మరమ్మతుల కోసమే?
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సుందిళ్ళ బ్యారేజీలో ఐదు గేట్లను ఎత్తి నిల్వ ఉన్న కొద్దిపాటి నీటిని శనివారం దిగువకు విడుదల చేశారు. నీటి విడుదలకు సంబంధించిన కారణాలను వెల్లడించలేదు. బ్యారేజీ పూర్తిగా ఖాళీగా కనిపిస్తోంది. చేపలను పట్టుకోవడానికి జనం ఎగబడుతున్నారు. మరమ్మతుల కోసమే నీటిని దిగువకు వదిలినట్లు చర్చ జరుగుతోంది.
మరమ్మతు చేసినా7వ బ్లాక్‌కు గండమేఎన్‌డీఎస్‌ఏ కూడా అదే చెప్పింది
మంత్రి ఉత్తమ్
2019 జూన్‌లో కాళేశ్వరం బ్యారేజీలు ప్రారంభం కాగా... అదే ఏడాది నవంబరులో వరదల అనంతరం గేట్లు మూయగానే సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురు అయ్యాయని, బ్యారేజీ లోపల, బయట అఫ్రాన్లు కూడా దెబ్బతిన్నాయని, బ్యారేజీల్లో లోపాలు బయటపడినా రిపేర్‌లు చేయలేదని నీటి పారుదల మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎంతో పాటు మంత్రులకు వివరించారు. ఇక మేడిగడ్డ బ్యారేజీలోని 7వ నంబర్ బ్లాక్‌కు మరింత నష్టం జరగకుండా ప్రస్తుత పరిస్థితిలో నిర్వహించే ఎలాంటి నివారణ చర్యలైనా తాత్కాలికమేనని, మరింత దెబ్బతినకుండా యధాతథ స్థితిని కొనసాగించడం కోసమే ఈ మరమ్మతులని చెప్పారు. ఈ మరమ్మతుల తర్వాత కూడా అత్యంత విపత్కర పరిస్థితిలో ఉన్న 7వ బ్లాక్ మరింత ముప్పుకు గురయ్యే అవకాశాలను తోసిపుచ్చలేమని ఎన్‌డీఎసఏ నిపుణుల కమిటీ నివేదికలో ఉందని ప్రస్తావించారు.

బ్యారేజీల అధ్యయనం, మరమ్మతులు ఏకకాలంలో!
కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థితిగతులపై ఏకకాలంలో మూడు కేంద్ర సంస్థలతో అధ్యయనం చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మేడిగడ్డ బ్యారేజీని ఢిల్లీకి చెందిన కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం(సీఎసఎంఆర్‌ఎస)తో, అన్నారం బ్యారేజీని పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్‌ఎస)తో, సుందిళ్ల బ్యారేజీని హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్‌ఏ)తో అధ్యయనం చేయించనున్నారు.

## తెలంగాణకు కావలసింది అధికార స్వరాలు కాదు..

# ధిక్కార స్వరాలు : కేసీఆర్

సమకాలీన రాజకీయాంశాలపై, ఆర్థిక స్థితిగతులపై ప్రముఖ వార్తా పత్రికల్లో ఆర్టికల్స్ రాయడమే కాకుండా నవశకానికి నాంది, ప్రగతి రథ చక్రాలు, ఫిస్కల్ ఫెడరలిజం, ద డాన్ ఆఫ్ న్యూ ఎరా, తెలంగాణ ఎకానమీ లాంటి పుస్తకాలను రచించారు. సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇండియన్ ఎకానమీ, తెలంగాణ ఎకానమీపై గెస్ట్ లెక్చర్లు కూడా ఇచ్చారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పేద విద్యార్థుల కోసం రాకేష్ రెడ్డి ఈ-క్లాసెస్ యాప్ అనే ఫ్రీ కోచింగ్ యాప్‌ను రూపొందించి ఉచితంగా అందజేశారు. హన్మకొండలో మెగా జాబ్ మేళాలు నిర్వహించారు. టీవీ చర్చల్లో చురుగ్గా పాల్గొని, విద్యార్థి, నిరుద్యోగ, ఉద్యోగుల సమస్యల, హక్కులపై బలంగా గళం విప్పారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు..

కరోనా మహమ్మారి సమయంలో, వరంగల్‌లో వరదలు వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలిచి తన వంతు సహాయాన్ని అందించారు. ఇండస్ ఫౌండేషన్ ద్వారా ఓరుగల్లులో కూచిపూడి, పేరిణి లాంటి నృత్య కళలను, పల్లె సంస్కృతులను, సాహిత్యాన్ని, మన జానపద కళారూపాలను పరిరక్షించడం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. కేసీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న రాకేష్ రెడ్డి.. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సరైన చాయిస్. యువకుడు, ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించే తత్వం, లోతైన విషయ పరిజ్ఞానం ఉన్న రాకేష్ రెడ్డిని పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే.. పట్టభద్రుల గొంతుకగా నిలుస్తారు. నిరుద్యోగుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాడు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మీ మొదటి ప్రాధాన్యత ఓటు రాకేష్ రెడ్డికే వేసి.. వారిని గెలిపించాలని కోరుతున్నాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## అనుమతి ఇవ్వని ఈసీ.

**హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**
కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర నిరాశ ఎదురయ్యింది. ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి రాకపోవడంతో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. శనివారం మధ్యాహ్నం కేబినెట్ సమావేశం నిర్వహించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కానీ ఒక వైపు లోక్‌సభ ఎన్నికల కోడ్, మరో వైపు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో కేబినెట్ సమావేశానికి అనుమతించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈసీని కోరింది. కానీ శనివారం రాత్రి వరకు ఈసీ నుంచి అనుమతి రాలేదు. ఈసీ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఇవాళ సాయంత్రం జరగాల్సిన కేబినెట్ భేటీ నిలిచిపోయింది.

ఈసీ నుంచి ఏ క్షణమైన అనుమతి వస్తుందని మంత్రులు అందరూ శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సచివాలయంలోనే వేచి ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు అన్ని విభాగాల అధికారులు కేబినేట్ భేటీకి హాజరయ్యేందుకు ఆఫీసులకు చేరుకున్నారు. కానీ రాత్రి 7 గంటల వరకు ఈసీ నుంచి స్పందన లేకపోవటంతో కేబినేట్ భేటీ జరగలేదు. సీఎంతో పాటు మంత్రులు వెనుదిరిగి వెళ్లారు.

రైతు రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లు, ఖరీఫ్ పంటల ప్రణాళిక, రైతులకు సంబంధించిన పలు కీలకమైన విషయాలపై ఈ భేటీలో చర్చించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎజెండా సిద్ధం చేసుకుంది. కానీ ఈసీ నుంచి స్పందన లేకపోవటంతో రైతుల సంక్షేమం, అత్యవసరమైన అంశాలపై చర్చించలేకపోయామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసీ నుంచి అనుమతి ఎప్పుడు వస్తే.. అప్పుడే కేబినేట్ భేటీ జరపాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. సోమవారం లోపు ఈసీ నుంచి అనుమతి రాకపోతే, అవసరమైతే మంత్రులతో కలిసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి అనుమతి కోరుతామని చెప్పారు.

## రేవంత్.. హామీలను

# నెరవేర్చలేరు

భువనగిరి టౌన్/హనుమకొండ టౌన్, మే 18:
ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే శక్తి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం బీజేపీ మాత్రమేనని తెలిపారు. భువనగిరిలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక భేటీలో, హనుమకొండలో జరిగిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల ఆత్మీయ సమ్మేళనం, బీజేపీ కార్యకర్తల భేటీలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని పొగుడుతూ, విపక్షాలను విమర్శిస్తూ కాలయాపన చేయడం రేవంత్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆ పార్టీలో ఉండే పరిస్థితి లేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ మొదలుకుని అన్ని పదవులకు బీజేపీ పోటీ చేస్తుందని, అందుకు స్థానిక నాయకులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిస్తే దానం, కడియం తరహాలో పార్టీ మారతాడని.. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే రేవంత్‌రెడ్డి జపం చేస్తాడని అన్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రజా గొంతుకగా నిలుస్తారని కిషన్‌రెడ్డి తెలిపారు.
సీఎంను కలిసిన బీజేపీ ఎమ్మెల్యేలు..
మంత్రులు గొడవలు పడి ప్రభుత్వాన్ని కూల్చుకుంటే తామేమీ చేయలేమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావ్ పటేల్, పైడి రాకేశ్ రెడ్డి సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, తడిసిన ధాన్యాన్ని కొనాలని, రుణమాఫీ చేయాలని కోరారు.
వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయాలి: రఘునందన్

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయాలని, లేదంటే ఆందోళనలు చేపడతామని బీజేపీనేత రఘునందన్‌రావు తెలిపారు. కేసులో ఆధారాలున్నా ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసుకు సంబంధించి డీజీపీ రవిగుప్తాను రఘునందన్ శనివారం కలిశారు. అనంతరం.. ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి వియ్యంకుడు అయినందునే వెంకట్రామిరెడ్డిని అరెస్ట్ చేయలేదా..? అని డీజీపీని అడిగామని చెప్పారు.

# ‘పవిత్ర’ బంధం విషాదాంతం!

**సోషల్ మీడియాలో వైరలైన శిల్ప-చందు-పవిత్ర ట్రయాంగిల్ లవ్‌స్టోరీ**

**ప్రేమించి, పెండ్లాడిన భార్య, బిడ్డలను వదిలేసి తోటినటితో చందు సహజీవనం**

**యాక్సిడెంట్‌లో పవిత్ర చనిపోవడంతో ఆమె లేనిలోకంలో ఉండలేక ఆత్మహత్య**

**పవిత్ర వద్దకే వెళ్తానని పోస్టులు.. భన్సీలాల్‌పేట్‌లో ముగిసిన అంత్యక్రియలు**

హైదరాబాద్ : త్రినయని టీవీ సీరియల్ నటుడు చందు అలియాస్ చంద్రకాంత్ ఆత్మహత్యతో ఎన్నో కొత్తకోణాలు వెలుగులోకి వస్తున్నాయి. శుక్రవారం మణికొండలోని సొంత ఫ్లాటులో ఉరేసుకోగా.. చందు వివాహ బంధంలో ఉన్న ట్విస్టులన్నీ బయటపడుతున్నాయి. చిన్ననాటి నుంచే శిల్ప అనే అమ్మాయి ప్రేమించి.. పెద్దల అంగీకారంతో 2015లో పెండ్లి చేసుకున్న చందు.. ఇద్దరు పిల్లలకు తండ్రయ్యాడు. కానీ, ఐదేండ్ల కిందట పరిచయమైన పవిత్ర జయరాం కోసం కన్నవారిని, కట్టుకున్న శిల్పను, అల్లారు ముద్దుగా పెరిగిన ఇద్దరు పిల్లలను (కొడుకు, కూతురు) వదిలేసి చివరకు తానే బలవన్మరణానికి పాల్పడటం చర్చనీయాంశమైంది. ఏ పనిలేకుండా తిరుగుతున్న భర్త చందును గాడిలో పెట్టేందుకు శిల్ప చేయని ప్రయత్నమంటూ లేదని తెలిసింది. అతడితో ఐటీ కంపెనీ పెట్టించిందని సమాచారం. అయినా, సినిమా, సీరియళ్లలో చాన్స్ కోసం ప్రయత్నాలు చేశాడని, అనూహ్యంగా త్రినయని సీరియల్‌లో అవకాశం రావడం, ఐదేండ్ల కిందట పవిత్ర జయరాంతో ఏర్పడిన పరిచయం, సాన్నిహిత్యం.. ప్రేమ, పెండ్లి బంధాన్ని దూరం కూడా దూరం చేసిందని సన్నిహితులు చెప్తున్నారు. భార్యాపిల్లలను వదిలి మణికొండలో చందు-పవిత్ర నివాసం ఏర్పాటు చేసుకున్నట్టుగా తెలిసింది. అదే ఫ్లాటులో చందు ఉరేసుకున్నాడు.

చందు పోస్టులు వైరల్
బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు కారు వస్తుండగా మహబూబ్‌నగర్ జిల్లా గత వారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ, తెలుగు కన్నడ నటి పవిత్ర జయరాం చనిపోయారు. పవిత్ర మరణం తర్వాత పూర్తిగా డిప్రెషన్‌లో పడిపోయిన చందు పూర్తిగా కోలేకపోయాడు. ఆమె చనిపోయిన తర్వాతనైనా భార్య, పిల్లలకు దగ్గర కాలేకపోయారు. పవిత్ర మనాదిలోనే ఉండిపోయాడు. పవిత్రమరణించిన నాటి నుంచి చందు ప్రతి రోజు ఆమె గురించి పోస్టులు పెడుతూనే ఉన్నారు. ఆత్మహత్యకు ముందు ‘ఈ రోజు పవిత్ర బర్త్ డే, మన జిమ్ కోచ్ కాల్ చేస్తున్నాడు.. వెళ్దాం రా పవిత్ర’ అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేసినట్టు తెలిసింది. అదే సమయంలో సన్నిహితులతో వాట్సాప్‌లో చేసిన చాట్‌లోనూ తనకు వెళ్లాల్సిన టైమ్ వచ్చిందని, వెళ్లిపోవడమే కరెక్ట్.. అంటూ మెసేజ్ చేసినట్టుగా సమాచారం. అలాంటి పనులు చేయొద్దని వారించినా చందు వినిపించుకోలేదని, తనను పవిత్ర పిలుస్తున్నదని మెసేజ్‌లు పంపాడని తెలిసింది. ఒక్కసారి మామ అని పిలుస్తావా.. అంటూ ఇన్‌స్టాలో పంచుకున్నట్టుగా తెలిసిం ది. త్వరలోనే వీరి రిలేషన్ షిప్‌కు పెండ్లి కార్డు పడే సమయంలోనే ఈ ప్రమాదం జరగడం, అంతలోనే చందు తీవ్ర మనోవేదనతో ఆత్మహత్య చేసుకోవడం జరిగిపోయినట్టుగా సన్నిహితులు చెప్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శనివారం భన్సీలాల్‌పేట్ శ్మశాన వాటికలో చందు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో చందు భార్య శిల్ప, పిల్లలు, తండ్రి వెంకటేశ్ పాల్గొన్నారు. మనవడితో కలిసి తండ్రి వెంకటేశ్ చితికి నిప్పంటించారు. చందు చివరి చూపు కోసం అభిమానులు, సన్నిహితులు, స్నేహితులు, తరలివచ్చారు.



# ప్రీమియం మేమే చెల్లిస్తాం..

**హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**
పంటలకు ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తుందని మంత్రి సీతక్క వెల్లడించారు. రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమె శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతులపై భారం పడనివ్వమని ఆమె స్పష్టం చేశారు. ఈ సీజన్ నుంచే స్కీమ్ అమల్లోకి వస్తుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అకాల వర్షాలకు తడిచిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు.

కొనుగోలు వేగవంతం చేయాలని అన్ని జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చామని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న వానలకు పంటనష్టం జరిగిందన్నారు. కల్లాలలో తడిసిన ప్రతి గింజనూ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని ఆమె స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం తరపున చర్యలు చేపట్టినట్లు సీతక్క వెల్లడించారు.

## ఈఏపీసెట్ ఫలితాలు

# విడుదల

**హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**
తెలంగాణ ఈఎపి సెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేశారు. 2,40,617 మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కు, 91,633 మంది విద్యార్థులు అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి ఎంట్రన్స్ రాశారు. ఈ ఫలితాల్లో ఇంజనీరింగ్ లో తొలి 9 ర్యాంకులు బాలురే కైవసం చేసుకోగా.. మొదటి రెండు ర్యాంకులు ఏపీ విద్యార్థులు సాధించారు.
ఇంజనీరింగ్ లో ఫస్ట్ ర్యాంక్ జ్యోతిరాధిత్య సాధించగా.. రెండో ర్యాంక్ హర్ష, మూడో ర్యాంక్ రిషి శేఖర్ శుక్లా, నాలుగో ర్యాంక్ సందేశ్, ఐదో ర్యాంక్ సాయి యశ్వంత్ రెడ్డి, 6వ ర్యాంక్ కుశల్ కుమార్, 7వ ర్యాంక్ విదీత్, 8వ ర్యాంక్ రోహన్, 9వ ర్యాంకుల్లో మణితేజలు నిలిచారు.
ఇంజనీరింగ్ లోనూ
ఇంజినీరింగ్ లోనే కాదు.. అగ్రికల్చర్, ఫార్మసీల్లోనూ ఏపీ విద్యార్థులు సత్తా చాటారు. మదనపల్లెకు చెందిన ప్రణీత ఫస్ట్ ర్యాంక్ సాధించగా.. సెకండ్ ర్యాంక్ విజయనగరంకు చెందిన రాధాకృష్ణ సాధించారు. మూడో ర్యాంక్ హనుమకొండకు చెందిన శ్రీవర్షిణి, నాల్గవ ర్యాంక్ చిత్తూరుకు చెందిన సాకేత్ రాఘవ్, 5,6వ ర్యాంకులు హైదరాబాద్ కు చెందిన సాయి వివేక్, మహమ్మద్ అజాన్ సాత్, 7వ ర్యాంక్ తిరుపతి %-% వెంగమాంబపురంకు చెందిన ముకేష్ చౌదరి, 8, 9 ర్యాంకులు హైదరాబాద్ కు చెందిన భార్గవ్ సుమంత్, ఆదిత్య, 10వ ర్యాంక్ శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన దివ్యతేజ సాధించారు.

కాగా, ఈ సెట్ లో పాసైన విద్యార్థుల్లో.. తొలి ప్రాధాన్యం తెలంగాణ విద్యార్థులకే ఉంటుందని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కాలేజీల సీట్ల కేటాయింపుల్లో ఏపీ విద్యార్థులకు కాంపిటిషన్ ఉంటుందని, లోకల్ విద్యార్థుల తర్వాతే వారికి సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

## కళ్యాణలక్ష్మి పథకానికి

# రూ.725 కోట్లు విడుదల..

**హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**
పేద వర్గాల వివాహ ఖర్చుల చెల్లింపుకు సంబంధించి రూపొందించిన కళ్యాణ లక్ష్మి పథకానికి ప్రభుత్వం రూ. 725 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా కళ్యాణ లక్ష్మి పథకం కింద రూ. లక్ష నగదుతో పాటు తులం బంగారం కూడా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం కేవలం రూ. లక్ష నగదు మాత్రమే ఇచ్చేది. కానీ, నగదుకు అదనంగా తులం బంగారం కూడా అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే.

# రైతు సమస్యలు పరిష్కరించండి..

## సీఎం రేవంత్‌ని కలిసిన బీజేపీ నేతలు



**హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈరోజు సచివాలయంలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పైడి రాకేష్ రెడ్డి కలిశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, పంటల కొనుగోలు దిశగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని%%%. వానలకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పినా అది అమలు కావడం లేదని చెప్పారు. ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని అన్నారు. రైతులకు బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు రసీదులు ఇవ్వడం లేదని సీఎంకి చెబితే అధికారులను పిలిచి సీఎం ఆదేశాలు జారీ చేశారని చెప్పారు.

మిగిలిన రైతు బంధుతో పాటు, రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరామని అన్నారు. తమ వినతిపై ప్రభుత్వం స్పందించకుంటే బీజేపీ ఉద్యమ కార్యాచరణతో ముందుకు వెళ్తుందని చెప్పారు. దేశంలో పదేళ్లుగా బీజేపీ సుస్థిర పాలనను అందిస్తోందన్నారు.

# అబ్బే సమయం పెంచటం లే..

**హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ సమయంలో ఎలాంటి మార్పు లేదని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. తాజాగా మెట్రో సమయాన్ని పొడిగిస్తూ.. రాత్రి 11.45 గంటలకు మెట్రో రైలు నడుస్తుందన్న వార్తలను తోసిపుచ్చింది. అలాగే ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటలకు తొలి మెట్రో ప్రారంభం కానుందన్న వార్త కూడా ఫేక్ అని కొట్టిపారేశారు. మెట్రో రైళ్లు యథావిధిగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నడుస్తాయని స్పష్టం చేశారు.
ఈ కొత్త సమయాలను అమలు చేయడం లేదని%%%. ప్రతి శుక్రవారం రాత్రి 11.45 గంటల వరకు, ప్రతి సోమవారం ఉదయం 5.30 గంటలకు మెట్రో రైళ్ల రాకపోకలను కేవలం పరిశీలించామన్నారు. దీనిపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ప్రస్తుతం ప్రయాణికుల రాకపోకలు, రైళ్లు, ట్రాక్‌ల నిర్వహణపై మాత్రమే పరిశీలన జరుగుతోందని స్పష్టం చేశారు. ప్రయాణికులు అనవసర గందరగోళానికి గురికావద్దని సూచించారు.

# జడ్పీ చైర్మన్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం







**భద్రాద్రి కొత్తగూడెం మే 18 (అక్షరం న్యూస్)**

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసమీక్షలో పారిశుధ్య కార్యక్రమాలు గ్రామీణ నీటి సరఫరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యక్రమాల, జిల్లా సమన్వయ ఆసుపత్రి సేవల, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జిల్లా విద్యాశాఖ, జిల్లా వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ చంద్రశేఖర రావు మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన సమస్యలు కొంత పరిష్కరించబడ్డాయని డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కొన్నిచోట్ల ప్రారంభానికి నోచుకోలేదని ఈ విషయంపై కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు దృష్టి సారించాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున కొరతగా ఉన్న మండల విద్యాశాఖ అధికారుల భర్తీపై శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వరి పంట సేద్యం పెరిగి ధాన్యం దిగుబడి ఎక్కువైనందున కొత్తగూడెం ఏరియాలో బాయిల్డ్ రైస్ మిల్ నిర్మాణం కొరకు స్థల సేకరణకు చర్యలు తీసుకోవాలని, వేసవి ఎండల తీవ్రత ఉన్నందున మంచినీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎండల తీవ్రత ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురైయ్యే అవకాశం ఉన్నందున వడదెబ్బతగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని గ్రామీణ వైద్య శాఖను కోరారు. వచ్చేది వర్షాకాలం సీజన్ అయినందున గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులపై జిల్లా పంచాయతీ శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, జూన్ నెలలో పాఠశాలలు పున: ప్రారంభ సమయములోనే విధ్యార్ధులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతం పడిపోతోందని కనుక విధ్యార్థుల శాతాన్ని పెంచడానికి విద్యాశాఖ తీసుకోవాలని, ప్రస్తుతం రెగ్యులర్ ఎంఈఓలు ఎంతమంది..? 2024 సంవత్సరంలో పదవీ విరమణ పొందనున్న ఎంఈఓలు ఎంతమంది ఉన్నారో విద్యాశాఖ నివేదిక కోరారు. ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి సభ్యులు అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాట్లాడుతూ, సాధారణంగా కమిటీలలో విద్య, వైద్య, ఉపాధి, వ్యవసాయం ఈ నాలుగు అంశాలే ప్రాధాన్యత వహిస్తాయని అన్నారు. ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు...? ఎంతమందిని భర్తీ చేయాలి..? నర్సులు ఎంతమంది ఉన్నారు..? ఎంతమందిని భర్తీ చేయాలి..? వంటి నివేదికలు ఏశాఖ వారైనా సాధారణంగా తయారు చేసుకొని ఇటువంటి సమావేశాలకు తీసుకు రావలసిన అవసరం ఉందని, డిఎం అండ్ హెచ్ఓ ప్రస్తుత పరిధిలో పనిచేయవలసిన అవసరం ఉందని సగానికి పైగా పిహెచ్.సి.లు 24 గంటలు పని చేస్తున్నాయని అంటారు. ఇది నిజంగా జరుగుతుందా అని ప్రశ్నించారు..? ప్రజలలో చైతన్యం రావాలని ఉద్యోగులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. కొత్తగూడెం నియోజక వర్గం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, అభివృద్ధి చెందిన దేశాలలో ప్రైవేటు స్కూల్ వ్యవస్థ లేదని అమెరికా వంటి అభివృద్ధి చెందినటువంటి దేశాలలో 08% విద్య ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించబడుతోందని, మన వద్ద హాస్పటల్స్ బిగ్ ఫెయిల్యూర్ అని హాస్పటల్స్ అభివృద్ధి చెందవలసిన అవసరముందని అన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి యస్.ప్రసూనా రాణి, మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వేంచేసిన పెద్దలకు, ప్రజా ప్రతినిధులకు, పాత్రికేయ మిత్రులకు, జిల్లా అధికార గణానికి కృతజ్ఞతలు తెలుపుతూ సభను ముగించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు జడ్పీటీసీలు, ఎంపీపీలు కో ఆప్షన్ సభ్యులు, జడ్పీ సీఈఓ యస్. ప్రసూనా రాణి, డిప్యూటీ సీఈవో కే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీ న్యాయవాదులందరికీ వర్తింప చేయాలి

## ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ డిమాండ్



**భద్రాద్రి కొత్తగూడెం మే 18 (అక్షరం న్యూస్)**

మే నెలతో కాలపరిమితి తీరబోతున్న అడ్వకేట్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని 2019 సంవత్సరం తరువాత వృత్తిలోకి వచ్చిన యువ న్యాయవాదులకు కూడా వర్తింప చేసి హెల్త్ కార్డులు జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్.యు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐఎల్.యు ప్రతినిధి బృందం శనివారం న్యాయ శాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి ని రాష్ట్ర సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కలుసుకుని వినతి పత్రం సమర్పించారు.

2024-2025 సంవత్సరానికి కొత్త గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీకి న్యాయవాదుల జాబితాను సరిచేయాలని, చనిపోయిన న్యాయవాదుల పేర్లు తొలగించాలని, ప్రస్తుత జాబితాలో లేని యువ న్యాయవాదుల పేర్లు చేర్చాలని వినతి పత్రంలో కోరారు. తెలంగాణ బార్ కౌన్సిల్ నుండి మొత్తం సమాచారం తెప్పించుకుని, బార్ అసోసియేషన్లతో సమన్వయంతో జాబితా తయారు చేయాలని వినతి పత్రంలో కోరారు. వయో పరిమితి విధించకుండా న్యాయవాదులందరికీ భీమా సౌకర్యం వర్తింప చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్ నుండి, న్యాయవాదులకు, వారి కుటుంబ సభ్యులకు, వైద్య ఖర్చుల నిమిత్తం జారీ చేస్తున్న గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీని రెండు లక్షల నుండి ఐదు లక్షల రూపాయలకు పెంచాలని కోరారు. వివిధ ప్రాంతాల న్యాయవాదులు తక్షణ నగదు రహిత చికిత్సను పొందేందుకు సహాయపడే నెట్వర్క్ ఆసుపత్రుల జాబితాలో అన్ని జిల్లా హెడ్ క్వార్టర్స్లో ఉన్న మరికొన్ని ఆసుపత్రులను జోడించాలని కోరారు. న్యాయవాదుల తల్లిదండ్రులకు కూడా భీమా కవరేజీని విస్తరింప చేయాలని కోరారు. ప్రసూతి ఖర్చులు కూడా పాలసిలో చేర్చాలని వినతి పత్రంలో కోరారు. ప్రతినిధి బృందంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏ.ఐ.ఎల్.యు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు జి.విద్యాసాగర్, అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ, కోశాధికారి ఇ. వేణుగోపాల్, ఉపాధ్యక్షురాలు చందాల శైలజ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, రమేష్ కుమార్ మక్కడ్, పి. కిషన్ రావు, ఎం. శంకరయ్య, వై.మంజులత ఉన్నారు.

# గ్రూప్ -1 ప్రిలిమనరీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలి






**ఖమ్మం, మే 18 (అక్షరం న్యూస్):**

గ్రూప్ -1 ప్రిలిమనరీ పరీక్ష నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ చైర్మన్ ఎం. మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు, పోలీసు సూపరింటెండెంట్లకు సూచించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో వచ్చే జూన్ 9 వ తేదీన నిర్వహించబడే టిజిపిఎస్సి గ్రూప్ -1 ప్రిలిమనరీ పరీక్షకు చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పరీక్ష నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి జిల్లాకు పరీక్షల నిర్వహణకు ఒక రీజనల్ కోఆర్డినేటర్ ను నియమించడం జరిగిందని, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు, రీజనల్ కోఆర్డినేటరు లు జాయింట్ కస్టోడియన్ గా ఉంటారని, వీరికి పోలీసు నోడల్ అధికారి సహకరిస్తారని ఆయన అన్నారు. ప్రతి సెంటకు ఒక డిపార్టుమెంటల్ అధికారిని నియమించాలని, తహశీల్దార్ స్థాయి అధికారిని ఫ్లయింగ్ స్క్వాడ్ గా, ప్రతి వంద మంది అభ్యర్థులకు ఒక ఐడెంటిఫికేషన్ అధికారిని నియమించాలని, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి చేయాలని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాలకు ఎవరు కూడా ఎలక్ట్రానిక్ వస్తువులు, గాడ్జెట్స్, సెల్ ఫోన్స్ వెంట తీసుకు రాకుండా తనిఖీలు నిర్వహించాలని, పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయాలని, పరీక్ష రోజున విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని, ఎమర్జెన్సీ మందుల ఏర్పాట్లతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాల ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాట్లు ఉండాలని, పరీక్ష రోజు 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలని, అన్ని జిరాక్సు షాపులు బంద్ చేసి ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష రోజు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థుల కోసం అదనంగా, ప్రత్యేక ఆర్.టి.సి. బస్సులు నడపాలని, పరీక్షకు రెండు రోజుల ముందే కేంద్రాలు పరిశుభ్రంగా వుండేలా పారిశుధ్య చర్యలు పూర్తి చేయాలని అన్నారు. త్రాగునీటి సౌకర్యం, కనీస మౌళిక సదుపాయాల కల్పన చేయాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ సెక్యూరిటీ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, పరీక్ష మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ నుండి పరీక్షా కేంద్రాలకు, పరీక్ష అనంతరం స్ట్రాంగ్ రూముకు రవాణా ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని, వాహనాల కండీషన్ పూర్తి సామర్థ్యంతో ఉండేలా చూడాలని, ట్రాఫిక్ పైలట్ ఏర్పాటుతో రవాణా సాఫీగా అయ్యేలా పోలీసు శాఖ పర్యవేక్షించాలని ఆయన తెలిపారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షా కేంద్రం ఉండేలా ఏర్పాట్లు చేయాలని, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం అర్హులైన స్క్రైబ్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులకు బయోమెట్రిక్ నిర్వహణ ఉంటుందని, సిబ్బందికి బయోమెట్రిక్ తీసుకునే విధానంపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలో రెండు రోజుల ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని ఆయన తెలిపారు. రీజనల్ కోఆర్డినేటర్లకు, సెంటర్ అబ్జర్వర్లకు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు, పోలీస్ నోడల్ అధికారులకు ఈనెల 22 వ తేదీన హైదరాబాదు, కూకట్ పల్లి జేఎన్టీయూ కాంప్లెక్స్ లోని యు.జి.సి. ఆడిటోరియంలో బయోమెట్రిక్ విధానంపై శిక్షణ అందిస్తామని ఆయన తెలిపారు. జూన్ 9 వ తేదీన ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం 1-00 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను బయోమెట్రిక్ హాజరు దృష్ట్యా ఉదయం 9-00 గంటల నుండే కేంద్రాలలోనికి అనుమతించడం జరుగుతుందని, 10=00 గంటలకు గేట్లు మూసివేయాలని, ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించడం కుదరదని ఆయన అన్నారు. అభ్యర్థులు తమ వెంట హాల్ టిక్కెట్ తో పాటు ఫోటో ఐడెంటిటీ కార్డు తీసుకురావాలని చైర్మన్ అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, జిల్లాలో 18, 600 మంది అభ్యర్థుల కోసం 52 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామని, సి.సి. కెమెరాల ఏర్పాటుతో పాటు, పరీక్ష సజావుగా నిర్వహించేందుకు లైజన్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించినట్లు, బయోమెట్రిక్ యంత్రాలు 1 రోజు ముందు జిల్లాకు వస్తే పరీక్షించి ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. మాలతీ, జిల్లా రవాణా శాఖ అధికారిణి అఫ్రిన్ సిద్దిఖీ, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. జాన్ బాబు, ఎస్బిఐటి ప్రిన్సిపాల్ డి. రాజకుమార్, ట్రాన్స్ కు డి.ఇ. బాబురావు, ఆర్టిసి డిపో మేనేజర్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎ. ఓ. అరుణ, సహాయ కోశాధికారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులు ఉపకార వేతనానికి దరఖాస్తులు చేసుకోవాలి

## గిరిజన అభివృద్ధి అధికారిణి ఎన్. విజయలక్ష్మి

**ఖమ్మం, మే 18 (అక్షరం న్యూస్):**

2024-25 సంవత్సరానికి ఖమ్మం జిల్లాలోని విదేశాల్లో చదివే గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉపకార వేతనానికి మే 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి ఎన్. విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్ స్థాయి పి.హెచ్.డి. పోస్ట్, డాక్టోరల్ రీసెర్చ్ ప్రోగ్రాం నందు చదవాలనుకునే గిరిజన విద్యార్థిని, విద్యార్థులు ఈ పథకానికి అర్హులని అన్నారు. ఎంపికైన గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులు ఈనెల 31లోగా https://overseas.tribal.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకుని, ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారిణి ఆ ప్రకటనలో కోరారు.

# ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్



**ఖమ్మం, మే 18 (అక్షరం న్యూస్):**

శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో పీవో, ఏపీవో లకు శిక్షణ ఇచ్చే, అసెంబ్లీ సెగ్మెంట్ల మాస్టర్ శిక్షకులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల విధులు అత్యంత జాగ్రత్తలతో జీరో ఎర్రర్ తో పూర్తిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా చేపడతారని ఆయన తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ల మాస్టర్ శిక్షకులు అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పీవో, ఏపీవోలకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పై అవగాహన కల్పించాలన్నారు. జంబో బాక్స్, గోద్రెజ్ లార్జ్ బాక్స్ లు సీలింగ్ విధానం గురించి పోలింగ్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. పీఓ, ఏపీఓ లు పోలింగ్ సంబంధిత ఫారాలు ఏ విధంగా పూరించాలో వారికి స్పష్టత వచ్చేలా శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ శిక్షకులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో పోలింగ్ అధికారుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు కె. శ్రీరామ్, మదన్ గోపాల్, అసెంబ్లీ స్థాయి మాస్టర్ శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.




# ఈవిఎం స్ట్రాంగ్ రూంలను ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి

**ఖమ్మం, మే 18 (అక్షరం న్యూస్):**

ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ ఈవిఎం స్ట్రాంగ్ రూంలను ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శనివారం తనిఖీలు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇవిఎం ల భద్రతకు అన్ని జాగ్రత్తలు చేపట్టాలని ఆయన అన్నారు. ఖాళీగా ఉన్న వెంటిలేటర్, కిటికీలను ఇటుకలతో మూసివేయాలన్నారు. వర్షపు జల్లులు లోనికి రాకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. స్ట్రాంగ్ రూంల భవనం పై స్లాబ్ ను పరిశీలించారు. వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారులు అప్రమత్తంగా వుంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. సిసి కెమెరాలను పరిశీలించారు. ఎల్ఇడి స్క్రీన్ పై 7 సెగ్మెంట్ల, పోస్టల్ బ్యాలెట్ల స్ట్రాంగ్ రూంల వ్యూ ను పరిశీలించారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. రిటర్నింగ్ అధికారి తనిఖీ సందర్భంగా ఆర్ అండ్ బి ఎస్ఇ శ్యామ్ ప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమూది, ఆర్ అండ్ బి ఏఇఇఇ విశ్వనాథ్, ఖమ్మం రూరల్ మండల తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపిఓ రాజారావు, అధికారులు తదితరులు ఉన్నారు.




# అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్



**భద్రాద్రి కొత్తగూడెం మే 18 (అక్షరం న్యూస్)**

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై టెలి కాన్ఫరెన్స్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, డిఆర్డిఓ, డిసిఓ, డిడి ట్రైబల్ వెల్ఫేర్, సీఈవో జడ్పీ, ఈఈ లు, డిఈ లు, ఏఈలు, మండల నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, ఎంఈఓ మున్సిపల్ కమిషనర్లతో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల టెలికాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపడుతున్న పాఠశాలల మరమ్మత్తులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా మొత్తం 862 పాఠశాలలో మరమ్మత్తులు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని పాఠశాలలలో చేపడుతున్న మరమ్మత్తులు అన్ని నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపడుతున్న మరమ్మత్తులన్నింటిని ఎంపీడీఓలు, ఎంఈఓ లు పర్యవేక్షించాలని ఆమె అన్నారు. వేసవి సెలవులు ముగిసి తిరిగి పాఠశాలలు ప్రారంభించే నాటికల్లా అన్ని పనులు పూర్తి కావాలని ఎంపీడీఓ లను ఎంఈఓ లను ఆమె ఆదేశించారు. మిగిలిన మరమ్మత్తుల పనులు అన్నిటికీ సోమవారం సాయంత్రంలోగా ఎస్టిమేషన్లను అందజేయాలని డిఈ లు, ఏఈ లను ఆదేశించారు. జూన్ 12 పాఠశాలలో పునః ప్రారంభానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో డిఆర్డిఓ విద్యా చందన, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

-ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
-ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి
-పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి
-సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
-ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించవద్దు,
-నిబంధనలు పాటించాలి
-అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా చూడాలి
-తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి..
-టీజి పిఎస్ సీ చైర్మన్ మహేందర్ రెడ్డి గ్రూప్-1 ఎగ్జామ్ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం మే 18 (అక్షరం న్యూస్)**

జూన్ 9న జరగనున్న గ్రూప్ -1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని టీజి పీ ఎస్ సీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు సీపీలు, ఎస్పీలు డీసీపీలతో టీ జి పీ ఎస్సీ సీ చైర్మన్ మహేందర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఐడిఓసి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల , అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజి పిఎస్ సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. తగిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఈ మేరకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. కలెక్టర్లు పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా పరీక్ష కేంద్రంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్ క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, పరీక్ష కంటే ముందు ఇన్ టైంలో చేరేలా చూడాలని సూచించారు. జూన్ 9న 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. పరీక్ష కేంద్రాల్లో కిటికీల వద్ద తగిన భద్రత సిబ్బందిని ఉంచాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రహరీ గోడల వెంట చుట్టూరా తగిన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్స్ చీఫ్ సూపరిండెంట్లు పరీక్ష ముగిసే సమయం వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలని, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. పలు జాగ్రత్తలపై అధికారులకు టీజి పీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. సెల్ ఫోన్లను అనుమతించవద్దని, పక్కాగా అరేంజ్మెంట్స్ చేయాలని,దివ్యాంగులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాలలో 18,663 మంది అభ్యర్థులు ఉన్నారనిఅభ్యర్థులు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల గ్రూప్ -1 పరీక్ష ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ గ్రూప్ -1 ప్రిలిమినరీ ఎగ్జామ్ సందర్భంగా సెల్ ఫోన్ లను, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోనికి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు 21 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 8875 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పరీక్ష జరిగే రోజున ఉదయమే తగిన భద్రత మధ్య ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నాపత్రాలను తరలించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు కన్ఫ్యూజ్ కాకుండా ఒక ప్రధాన గేటు ద్వారానే పరీక్ష కేంద్రంలోకి పంపించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని పేర్కొన్నారు. జూన్ 9న 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించాలని, 10 గంటలకు పరీక్ష కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేయాలని ఆదేశించారు. అభ్యర్థుల బయోమెట్రిక్ వెరిఫికేషన్ క్షుణ్ణంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి తప్పిదాలు జరగకుండా అధికారులు చూసుకోవాలని, నిర్లక్ష్యంగా మాత్రం ఉండవద్దని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 22న హైదరాబాద్లో బయోమెట్రిక్ పోలీస్ ఆఫీసర్లు, పోలీస్ నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా సాగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని పేర్కొన్నారు. టి జి పి ఎస్ సి నిబంధనలకు అనుగుణంగా పరీక్ష జరిగేలా చూడాలని తెలిపారు. దివ్యాంగులు అంద అభ్యర్థులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ టిజి పిఎస్ సి రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ జగన్మోహన్ రాజుతో కలిసి ఐడిఓసి కార్యాలయంలో ఉన్న స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రెహమాన్, జిల్లా పరిపాలనాధికారి గన్యా తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి..

టీజీపీఎస్సీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి
జిల్లాల కలెక్టర్లు సీపీలు, ఎస్పీలు డీసీపీలతో ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష



**వరంగల్ మే 18 (అక్షరం న్యూస్)**

వరంగల్ జిల్లా జూన్ 9న జరగనున్న గ్రూప్ -1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలనిటీజీపీఎస్సీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆదేశించారు. గ్రూప్-1 ప్రిలిమినరీ ఎగ్జామ్ కు సంబంధించిన ఏర్పాట్లపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు సీపీలు, ఎస్పీలు డీసీపీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.వరంగల్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అదనపు కలెక్టర్ సంధ్యారాణి, పరీక్షల సమన్వయకర్త చంద్ర మౌళి తదితరులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీజీపీఎస్సీఎస్సీ చైర్మన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పరీక్ష ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా కలెక్టర్లు ఎస్పీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని వసతులు కల్పించాలని పేర్కొన్నారు. తగిన నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఈ మేరకు సీసీ కెమెరాలు అమర్చాలని సూచించారు. సెల్ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ సంబంధించిన వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని ఆదేశించారు. కలెక్టర్లు పోలీస్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఆయా పరీక్ష కేంద్రంలో తగిన బందోబస్తు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓఎంఆర్ షీట్లు, ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్ హెడ్ క్వార్టర్లలో తగిన బందోబస్తు మధ్య ఉంచాలని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలకు వాటిని జాగ్రత్తగా తీసుకెళ్లాలని, పరీక్ష కంటే ముందు ఇన్ టైంలో చేరేలా చూడాలని సూచించారు. జూన్ 9న 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించాలని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అభ్యర్థులు ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. పరీక్ష కేంద్రాల్లో కిటికీల వద్ద తగిన భద్రత సిబ్బందిని ఉంచాలని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రహరీ గోడల వెంట చుట్టూ తగిన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి మాస్ కాపీయింగ్, పేపర్ లీకేజీ జరగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. రీజినల్ కోఆర్డినేటర్స్ చీఫ్ సూపరిండెంట్లు పరీక్ష ముగిసే సమయం వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూసుకోవాలని, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్

**కొత్తగూడెం మే 18 (అక్షరం న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు లో జూన్ 8న జరిగే జాతీయ అదాలత్ లో ఎక్కువ కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్ లో పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతొ జరిగిన సమీక్ష సమావేశంలో తెలిపారు.ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని తెలిపారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. లోక్ అదాలత్ లో రాజీపడటం వలన కక్షిదారులకు సమయం, డబ్బు వృధా కాజాలదని తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ వారిగా పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ఈ సందర్భంగ న్యాయమూర్తి పోలీస్ స్టేషన్స్ వారిగా పెండింగ్ లో ఉన్న క్రిమినల్ కాంపౌండ్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఇ -పెట్టి చాలన్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, మనోవర్తి, మోటార్ వాహన ప్రమాద కేసులు మరియు బ్యాంకు కేసులను పరిష్కరించుకొనుట కొరకు కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.శివ నాయక్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని




సత్యనారాయణ, కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్, పి పీలు పోసాని రాధాకృష్ణమూర్తి, నాగిరెడ్డి, ఎక్సైజ్ అధికారులు, స్టేషన్ హౌస్ ఆఫీసర్స్, ఇన్సూరెన్స్ కంపెనీ కి సంబంధించి సీనియర్ న్యాయవాదులు కొత్తపల్లి రామారావు, బండారుపల్లి గంగాధర్, అంబటి రమేష్, ఏఓ మోహన్ దాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలి.

జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి రిజ్వాన్ భాషా షేక్



**జనగామ ప్రతినిధి మే(18) (అక్షరం న్యూస్)**

ఈ నెల 27వ తేదీన జరగనున్న వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ ను సమర్థవంతంగా నిర్వ హించాలని జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి, రిజ్వాన్ భాషా షేక్ అన్నారు.శనివారం సమీ కృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధానసమా వేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వరంగల్-ఖమ్మం-నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలకు అవగాహన కార్యక్రమాన్నినిర్వహించారు.ఈసందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు (23,419) మంది ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు (14,915) మంది ఉండగా, మహిళా ఓటర్లు (8,503) మంది కాగా, ఇతరులు ఒకటిగా నమోదైనట్లు తెలిపారు.ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు గాను జనగామ, ఘనపూర్ (స్టేషన్) డివిజన్ ల పరిధిలో (27)పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు.పోలింగ్ కు రెండు రోజుల ముందు (ఈ నెల 25వ) తేదీన సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలనుసందర్శించి, పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు, విద్యుత్, ఫర్నీ చర్, తదితర మౌలిక వసతులనుసరిచూసు కోవాలన్నారు.పోలింగ్ రోజున(ఈ నెల27)న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నట్లు తెలి పారు. పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేప ట్టాలని, ఓటర్లు బ్యాలెట్ బాక్సులో బ్యాలెట్ పేపర్ తో ఓటు వేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమ నిబంధనలను పాటించాలని అధికారులకు సూచించారు. పోలింగ్ విధులు నిర్వహించే అధికారులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం జరుగుతుందని, కలెక్టర్ కార్యాల యంలోనే ఓటరు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, పోస్టల్ బ్యాలెట్ లను స్వీకరిస్తామని తెలిపారు.అంతకుముందు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు.ఈకార్య క్రమంలో జిల్లా నోడల్ అధికారులు, జెడ్పీ సీఈఓ అనిల్ కుమార్, జనగామ,ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు దేవరాయి కొమరయ్య, డీఎస్. వెంకన్న, సెక్టార్ అధికారులు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, తదితరులు పాల్గొ న్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, పాఠశాలల పునః ప్రారంభంలోగా పూర్తిచేయాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్

**ఖమ్మం, మే 18 (అక్షరం న్యూస్)**

అమ్మ ఆదర్శ పాఠశాలల క్రింద పాఠశాలల్లో అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, పాఠశాలల పునః ప్రారంభం లోగా పూర్తిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. శనివారం నూతన కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్యా శాఖ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం క్రింద 753 పాఠశాలలు రూ. 2138.623 లక్షల వ్యయ అంచనాలతో చేపట్టినట్లు తెలిపారు. పనుల పూర్తికి గాను రూ. 518.5 లక్షలు అడ్వాన్స్ గా చెల్లించామన్నారు. ఇట్టి పాఠశాలల్లో 651 పాఠశాలల్లో పనులు గ్రౌండింగ్ చేసి, ఇప్పటికి 226 పాఠశాలల్లో పనులు పూర్తి చేశామన్నారు. 425 పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉండగా, 102 పాఠశాలల్లో పనులు ఇంకనూ ప్రారంభించలేదని ఆయన అన్నారు. పురోగతిలో ఉన్న పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా, ఇంకనూ పనులు ప్రారంభించని పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించి, పనులు వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. పాఠాశాలలు పునః ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా అధికారులు రోజావారి పనుల పురోగతిపై పర్యవేక్షన చేయాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ పి వినోద్, పి.ఆర్, ఎస్. ఇ. చంద్రమౌళిశ్వర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, పి.ఆర్. ఇఇ. లు వెంకట రెడ్డి, కెవికె. శ్రీనివాస్, ఇ.ఇ. టిడబ్ల్యూ ఐడిసి నాగశేషు, మండల విద్యా శాఖ అధికారులు, ఇంజనీరింగ్ శాఖ ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మొదటి ప్రాధాన్యత ఓటుతో కాంగ్రెస్ అభ్యర్థిని గ్రాడ్యుయేట్లు గెలిపించాలి.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



**జనగామ మే (18)(అక్షరం న్యూస్)**

రాబోయే ఉప ఎమ్మెల్సీ ఎన్నికలోగ్రాడ్యుయేట్లు మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తెలిపారు.ఈసందర్భంగా శనివారంవిజయ ఫంక్షన్ హాల్లోగ్రాడ్యుయేట్ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపుకోసం డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావే శంలో ముఖ్య అతిథులుగా ఎమ్.ఎల్.సి ఎన్ఎస్యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న, ఎన్నికల నియో జకవర్గ ఇంచార్జ్ భవాని రెడ్డి పాల్గొని మాట్లా డారు .తీన్మార్ మల్లన్న అలుపెరగని పోరా టం చేసారని ప్రజల పక్షాన, నిరుద్యోగుల పక్షాన అందరికి కోసం అని తెలిపారు. వారిని గెలుపించికోవడం మన అందరి బాధ్యత అన్నారు. కాబట్టి గ్రాడ్యుయేట్స్ అందరూ మల్లన్నకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుంటే మన తరపున నిలబడి కొట్లాడుతాడాని తెలిపారు.ఈకార్య క్రమంలో ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభిగౌడ్,కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి స్నేహితుల చేయూత



**హుజురాబాద్, మే 18 (అక్షరం న్యూస్)**

హుజురాబాద్ పట్టణంలో గాయత్రి మార్బుల్ షాప్ నిర్వాహకుడు, ఆర్.ఎం.పి ఇప్పలపల్లి రవీందర్ నెల రోజుల క్రితం షాలపల్లి ఇంద్రనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఆయన స్నేహితులు స్వచ్ఛందంగా ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఎవరికి తోచినంత వారు ఆర్థిక సాయం చేయడంతో రూ. 1,20,500 పోగు చేసి అతని భార్య రేణుక పేరు మీద ఫిక్స్ డిపాజిట్ చేసి ఆమెకు బండ్ ను శనివారం అందజేశారు. మృతుడు రవీందర్ కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండడంతో వారి భవిష్యత్తు అవసరాల కోసం ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడుతుందని ఆయన స్నేహితులు తెలిపారు. బాండును అందజేసిన వారిలో అతని స్నేహితులు టి రమేష్, శ్రీనివాస్ గోవర్ధన్, పరమేష్, జ్ఞానేశ్వర్, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

# తడిసిన ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్



కరీంనగర్ /చిగురుమామిడి/ మేబీ 18 (అక్షరం న్యూస్)

చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో ప్రభుత్వము ఏర్పాటు చేసిన ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని శనివారం, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడిసి పోయిందని వారన్నారు కోనుగోలుకేంద్రాలకు వచ్చిన ధాన్యాన్నివెంటనేతూకంవేయనందున వర్షాలకు తడిసిందని చేతికి అందిన పంట నీటిపాలైందని వారు అన్నారు. కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా ఇప్పటివరకు అమలు చేయలేదని మరి ధాన్యం 500 బోనస్ తో పాటు రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని వారు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోన్నం,శ్రీనివాస్ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్,కంటే శ్రీనివాస్,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గార్దస్ సతీష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు గుళ్ళ కిష్టయ్య ,బిజెపి సీనియర్ నాయకులు కొంకటి లక్ష్మణ్, కూన పోచయ్య,రామ్ రెడ్డి, బిమర లక్ష్మన్ బూత్ అధ్యక్షులు బుర్ర సతీష్,తులాల వెంకటేశ్వర్లు, ఎన్నము సంతోష్, కొంకటి లక్ష్మి మరియు సాయి,కిరణ్,సాత్విక్, పోతరవేని శ్రీనివాస్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలు ఆందోళన చెందొద్దు

- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ కలెక్టర్ కు మంత్రి పొన్నం ఆదేశం
- రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత

కరీంనగర్/చిగురుమామిడి/మే18(అక్షరం న్యూస్)



గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట నష్టపోయిన రైతులు ఎవరు ఆందోళన చెందొద్దని సర్కార్ అండగా ఉంటుందని డిసిసి అధికార ప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలపై మంత్రి పొన్నం ఆరా తీసినట్లు ఆయన తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ఎటువంటి తాలు లేకుండా కొనుగోలు చేయాలంటూ కలెక్టర్ కు మంత్రి పొన్నం ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. రైతులు ఎక్కడ కూడా నష్టపోకుండా దాన్యం కొనుగోలు వేగవంతం అవుతుందని ఆయన తెలిపారు. మంత్రి పొన్నం అమెరికా పర్యటన ఉన్నప్పటికీ ఇక్కడ పడుతున్న వర్షాలు తో ప్రజలకు ఏమి నష్టం జరుగుతున్నాయి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారని ఆయన వివరించారు. రైతులెవరు అధైర్యపడవద్దు అని... ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే ఆ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని ఆయన వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎవరు ఆందోళన చేందొద్దు అని ఆయన భరోసా కల్పించారు.

## ఆర్టీసీ బస్సులో నుండి టైర్ కింద పడి మహిళ మృతి..

ఖమ్మం/ తల్లాడ మే 18 (అక్షరంన్యూస్)





ఖమ్మం జిల్లా కొనిజర్ల మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో బస్సులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు డోరు వద్ద జారిపడి బస్సు టైర్ ఎక్కటంతో దూరి అనూష 35 అనే మహిళ మృతి చెందారు. కొనిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామానికి చెందిన దూరి అనూష అనే మహిళ ఖమ్మంలోని ఓ షాపింగ్ మాల్ లో చిరు ఉద్యోగం చేస్తూ ప్రతిరోజు స్వగ్రామం నుంచి ఖమ్మం బస్సులో వెళ్తుంది ప్రతిరోజు లాగానే కొణిజర్లలో ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కింది బస్సులో ఎక్కువ మంది రద్దీగా ప్రయాణికులు ఉండటంతో డోరు వద్దనే నిల్చుంది. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బస్సు సడన్ బ్రేక్ వేయడంతో డోర్ వద్ద నిలుచున్న అనూష ప్రమాదవశాత్తు కింద పడిపోయింది పడిపోయినా అనూష పైకి వెనక టైరు ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటనా స్థలాన్ని కొనిజర్ల ఎస్సై శంకర్రావు పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు.

# జవహర్ నగరలో ఈదురు గాలులతో వర్షం





- శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ ప్రజలను పట్టించుకునేది ఏవరు...?
- రోడ్లు, అండర్ డ్రైనేజి, కరెంట్ స్థంబాల కోసం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ ప్రజలు పడిగాపులు
- ఎన్నికల ముందు ఇచ్చిన హామిలను నేతలు నెరవేర్చాలి

అక్షరంన్యూస్, జవహర్ నగర్ : హైదరాబాదు నగరంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు ఉన్నాయి. హైదరాబాద్ తో పాటు పలు ప్రాంతంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. నగరం చుట్టుపక్కల మేడ్చల్ జిల్లా జవహర్ నగర్, కాప్రా, దమ్మాయిగూడ, యాప్రాల్ తో పాటు తదితర ప్రాంతాల్లో కూడా వర్షంతో కూడిన ఈదురు గాలులు వీచాయి. శనివారం సాయంత్రం మరిన్ని ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ తెలిపింది. ఈ సందర్బంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో కురిసిన వర్షానికి శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ ప్రజలంతా రాత్రి సమయాల్లో భయపడుకుంటూ నిద్రపోవల్సి వస్తుందని మా కాలనిలో రోడ్లు, అండర్ డ్రైనేజి తో పాటు కరెంట్ కూడా సరిగా లేదని, గత ఎన్నికల ముందు నాయకులు స్థానిక కార్పొరేటర్ కారింగుల నిహారిక గౌడ్ ఎన్నికలు అనంతరం రోడ్లు వేస్తానని ఇప్పటి వరకు ఏలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని, ఇప్పుడు కురిసే చిన్న చిన్న వర్షాలకే మా కాలనీ అంత బురద మయంగా మారి, మేము ఇండ్లల్లో నుండి బయటకు రాకుండా ఉంటుందని, వర్షం కాలం వచ్చే నాటికి మా పరిస్థితి అద్వానంగా ఉంటుందని, మా సమస్య ను ముందుగానే గ్రహించి ఎన్నికల ముందు ఇచ్చిన హామిని నేతలు నెరవేర్చాలని కాలనీ ప్రజలంతా హామీలిచ్చిన నాయకులను కోరుతున్నారు..ఏదేమైనా వర్షాలు వచ్చినప్పుడల్లా కాలనీ ప్రజలమంతా మనకు మనమే అప్రమత్తంగా ఉండాలని, కాలనీ చుట్టుపక్కలంతా గుట్టలు, చెట్లు, పుట్టలు ఉంటాయి కాబట్టి, వర్షాలకు పాములు, తేల్లు , పురుగు పూసి బయటకు వస్తాయి, వాటి వల్ల మనకు, మన కుటుంబ సభ్యులకు, మన పిల్లలకు రాత్రి సమయాల్లో బయటకు వస్తే ప్రమాదలు ఉంటాయాని, అందుకని పిల్లలను బయటకు రాకుండా మనమే చూసుకోవాలని , రోడ్లు , అండర్ డ్రైనేజి, కరెంట్ స్థంబాల కోసం శ్రీ లక్ష్మీ నరసింహా స్వామీ కాలనీ ప్రజలు పడిగాపులు కాస్తున్నారు.

# టీ ఎస్ కి బదులు టీజీ గా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు పాటించాలి...

జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్...

మహబూబాబాద్ /గార్ల /మే 18/అక్షరం న్యూస్...



రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ననుసరించి టీ ఎస్ కి బదులుగా టీజీ అని మార్చాలని ప్రభుత్వ శాఖల అధికారులు, పి ఎస్ యు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీలు పేర్లలో టిఎస్ బదులుగా టిజిగా మార్చాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్ర అబ్రియేషన్స్ గా సూచించే 'టీఎస్' స్థానంలో టీజీని వినియోగించేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసినట్లు తెలిపారు. మార్చి నెలలో వాహనాల రిజిస్ట్రేషన్ కు సంబంధించిన అనుమతులు రాగా, తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్ కు బదులుగా టీజీని వినియోగించేందుకు అనుమతి జారి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంస్థలు, పీఎస్ యులు, ఏజెన్సీల పేర్ల ముందు టిఎస్ కు బదులు టిజి గా మార్చాలని ఆదేశించారు. ఉదాహరణకు టీఎస్ఎన్పిడిసిఎల్ పేరును ఇక నుండి టిజిఎన్పిడిసిఎల్ గాను, టీఎస్ఆర్టీసీ పేరును టిజిఆర్టీసీగా మార్చాలని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులకు శనివారం సర్క్యులర్ జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, ఏజెన్సీలు, స్వయంప్రతిపత్తి గల సంస్థలు, ప్రభుత్వ సంస్థలన్నీ ఇకపై వాటి పేర్లను టిజితో ప్రారంభమయ్యేలా మార్చుకోవాలని ఆయన సూచించారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు, ఆన్లైన్ ఫ్లాట్ ఫామ్ లు ,పాలసీ పేపర్లు, జీవోలు, ఇతర అధికారిక కమ్యూనికేషన్లన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తీసుకున్న చర్యలపై ఈ నెల 25వ తేదీలోపు అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలని, అట్టి నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు ఆయన అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.

## యువతి అదృశ్యం కేసు నమోదు

హనుమకొండ/భీమదేవరపల్లి/మే 18 (అక్షరం న్యూస్):



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన రీతిక, వయస్సు 24 అనే యువతి గురువారం రాత్రి ఇంటి నుండి కనిపించకుండా పోయింది. రెండు రోజులుగా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో వెతికినా దొరకకపోవడంతో యువతి తల్లిదండ్రులు శనివారం వంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. యువతి ఎరుపు రంగు, కోల మొఖం, కొంచెం మెల్లకన్ను తో, నీలం రంగు పంజాబీ డ్రెస్ తెలుపు రంగు పైజామా వేసుకుని ఉందని తెలిపారు. యువతి ఆచూకీ తెలిసినవారు ఈ కింది ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వగలరు. సమాచారం ఇచ్చిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

## నిడిగొండలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**హాజరుకానున్న చిన్న జీయర్ స్వామి**

జనగామ జిల్లా/ రఘునాథపల్లి /( అక్షరం న్యూస్ ) మే 18:

మండలంలో ని నిడి గొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం అధ్యయనోత్సవ బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుండి 22వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి చిన్న జీయర్ స్వామి హాజరుకానున్నట్లు స్థానిక దేవాలయ కమిటీ నిర్వాహకులు గంగిడి నరసింహారెడ్డి తదితరులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహోత్సవ క్రతుల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. నిడిగొండ గ్రామ ప్రజల ఆరాధ్య దైవంగా పూజించే లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ ఉత్సవాలు నిర్వహించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కల్యాణోత్సవంలో పాల్గొనవలసిన వారు రూ.516 చెల్లించి పూజా కార్యక్రమాలకు రావాలనిఆలయ కమిటీ సూచించింది. కాగా తొలి రోజున బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి.

## ఇంటి పనులు వార్షిక అద్దె విలువ పద్ధతిలో నిర్ధారించాలి : ఏ సి ఎఫ్ ఆఫ్ బిజిఎంసి



రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / మే 18 / అక్షరం న్యూస్ : బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంటి పనులను వార్షిక అద్దె విలువ పద్ధతిన ఇంటిపన్ను నిర్ధారించాలని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఆఫ్ బి.జె.యం.సి. అధ్యక్షులు యం.సుధాకర్, ప్రధాన కార్యదర్శి నరేందర్ బాబులు అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రస్తుతము అమలు పరుస్తున్న ఇంటిపన్ను లెక్కింపు విధానము వలన మునిసిపాలిటీలో నివసిస్తున్న వారిలో ఒక్కకరికీ ఒకొక్క రకంగా ఇంటిపన్ను రావటంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలియచేస్తూ లేఖ రాసారు. మేరకు రిజిస్టర్ పోస్టును వారు సీఎంకు పంపించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్ లో రెజిస్ట్రేషన్ విలువకు, ఇంటిపన్నుకు ముడిపెట్టి లెక్కిస్తున్నందున చాలా ఇబ్బందులు వస్తున్నాయని, రెజిస్ట్రేషను ధరలు పెరిగినప్పుడల్లా దానికి అణుగుణంగా ఇంటిపన్నులు కూడా మారుతున్నాయని అన్నారు. కావున ఇంటి పన్నునుకావున ఇంటిపన్నును వార్షిక అద్దె విలువ పద్ధతిన నిర్ణయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నదీమ్, వినయ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# తోటకూర సైదయ్య చేసిన పోరాటాలు చిరస్మరణీయం

- సిపిఎం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు
- ఘనంగా సైదయ్య 21వ వర్ధంతి సభ



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం /మే 18 /అక్షరం న్యూస్: బడుగు బలహీన వర్గాల కోసం తోటకూర సైదయ్య చేసిన పోరాటాలు చిరస్మరణీయమని సిపిఐ ఎం భద్రాచలం నియోజకవర్గం అన్నారు. శనివారం అశోక్ నగర్ కొత్త కాలనీలో సిపిఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన తోటకూర సైదయ్య 21వ వర్ధంతి సభ లో మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా కళాకారుడిగా భద్రాచలం గద్దర్గా పేరుపొందిన తోటకూర సైదయ్య తన కళారూపాలతో ప్రజలను చైతన్య పరచడమే కాక ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారని గుర్తు చేశారు. అశోక్ నగర్ కొత్త కాలనీ అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాల కల్పన కోసం అక్కడి ప్రజలతో కలిసి సైదయ్య చేసిన పోరాటాల ఫలితంగా కొత్త కాలనీకి మౌలిక సదుపాయాలు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. వరదలు వచ్చినా ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సైదయ్య ప్రజలకు అండగా నిలిచే వారిని అటువంటి నాయకుడు భౌతికంగా లేకపోయినా ఆయన పోరాటాలు చిరస్మరణీయంగా ఉంటాయని స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా ఎన్ని ఆటంకాలు ఆర్థిక ఇబ్బందులు వచ్చిన తట్టుకొని కడవరకు ఎర్రజెండాని వీడని సైదయ్య నేటి తరానికి ఆదర్శమని అన్నారు. దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాటమే సైదయ్యకు మనమిచ్చే నివాళి అని అన్నారు. గత ఆరేళ్ల నుండి కొత్త కాలనీ అభివృద్ధికి దూరంగా ఉంటుందని కొత్తకాన్ని సమస్యలపై మరోసారి ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు ఎర్రం శెట్టి వెంకట రామారావు పారెల్లి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు డి సీతాలక్ష్మి సంద్ర భూపేంద్ర సైదన్న కుమారుడు తోటకూర సందీప్ కుటుంబ సభ్యులు జెట్టి శ్రీనివాసరావు శాఖ కార్యదర్శి చెన్నూరు వెంకటరమణ ప్రజా కళాకారులు అశోక్ సుధాకర్ పార్టీ సభ్యులు చాట్ల శ్రీనివాసరావు రాజేంద్ర హైమావతి తదితరులు పాల్గొన్నారు

# యమ్ సెట్ ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల ప్రభంజనం



భద్రాద్రి కొత్తగూడెం /భద్రాచలం /మే 18 /అక్షరం న్యూస్ : నేడు ప్రకటించిన యమ్ సెట్ ఫలితాలలో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించి రాష్ట్రస్థాయి లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులైన మోడం మేఘన (2411%ఎ%05314) 3831 ర్యాంకు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచారు. అదేవిధంగా చలపాక వాసుదేవ మణిదీప్ కుమార్ (2412%జీ%02044) 6352 ర్యాంకు సాధించి సత్తా చాటారు. గత నెలలో ప్రకటించిన ఇంటర్ పరీక్ష ఫలితాలలో మొదటి సంవత్సరం ద్వితీయ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అగ్రస్థానంలో నిలిచిన లిటిల్ సంస్థలు ఎంసెట్లో కూడా ఉత్తమ ప్రతిభను కనపరిచి ర్యాంకులు సాధించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల ఆవరణలో డైరెక్టర్లు మాగంటి రమేష్ బాబు మాగంటి ప్రసాద్ బాబులు మెమెంటో ఇచ్చి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలలో విద్యార్థులు 50 మందికి పైగా ఎంసెట్ లో అర్హతను సాధించారని అన్నారు. అదేవిధంగా ఇంటర్లోను ఎంసెట్ లోను ఉత్తమ ప్రతిభను కనబరిచారని అన్నారు. ఈ విజయానికి కారుకులైన విద్యార్థుల తల్లితండ్రులు ఉపాధ్యాయ సిబ్బందిని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ తో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం



కోహెడ/సిద్దిపేట,మే 18(అక్షరం న్యూస్) అకాల వర్షాలతో

కోహెడ మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలలో తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం డిమాండ్ చేశారు. అకాల వర్షాలతో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు సెంటర్లలో కొనుగోలు త్వరగా జరగకపోవడంతో ధాన్యం తడిసి ముద్దయి మొలకెత్తుతున్న నేటికి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల సమీక్ష లేదు చిత్తశుద్ధి అంతకన్న లేకపోవడంతో కోహెడ మండలంలోని వరుకోలు వద్ద కొనుగోలు సెంటర్ కు వెళ్లి తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ఎలాంటి కటింగ్ లు లేకుండా తడిదాన్యం కొనుగోలు చేసి క్వింటాలు కు 500రూ"ల బోనస్ ప్రకటించి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధానకార్యదర్శి పిల్లి నర్సయ్య గౌడ్, బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రామంచ రాంచంద్రరెడ్డి,ఓబీసీమోర్చా మండల అధ్యక్షుడు కక్కర్ల దామోదర్ గౌడ్, వరుకోలు గ్రామశాఖ అధ్యక్షుడు బత్తిని రమేష్ గౌడ్, బూత్ అధ్యక్షుడు అలెటి కిష్టారెడ్డి, వివిధ బాధ్యతల్లో ఉన్న నాయకులు మొండె సంతోష్, బైరం అరవింద్, బోయిని అజయ్, మడ్డి పర్షరాములు, బత్తిని శ్రీనివాస్, ముస్కుల పవన్ కల్యాణ్, చల్లురు మురళి, కొమిరె రామస్వామి, పాలకొండ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం... రైతు సంక్షేమ ప్రభుత్వం...

- జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్.



కరీంనగర్ /చిగురుమామిడి/ మే 18,(అక్షరం న్యూస్)

చిగురుమామిడి మండలంలోని ముల్కనూరు, పీచుపల్లె గ్రామాల్లో వర్షానికి తడిసన దాన్యాన్ని పరిశీలించేందుకు వరి కొనుగోలు కేంద్రాలను జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ సందర్శించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ వర్షం వల్ల ధాన్యానికి ఎలాంటి నష్టం జరగలేదని, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఈ యాసంగి సీజన్లో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా, నష్టం వాటిల్లకుండా సజావుగా కొనుగోళ్లు పూర్తిచేసిందన్నారు. ఇప్పటికి మండలములో 2,3 సెంటర్లల్లో తప్ప పూర్తి స్థాయిలో కొనుగోలు పూర్తి అయ్యిందన్నారు. ఈ సీజన్లో 1943 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. ప్రభుత్వ పనితీరు పట్లరైతుల్లోహర్షాతిరేకాలువ్యక్తమవుతున్నాయాన్నారు. గతములో లాగ అధిక తూకం, తాలు పేరుతో మిల్లర్లు క్వింటాల్ కి 5,6 కిలోల తరుగులాంటి ఇబ్బందులు లేకుండా రైతన్నకు అన్ని విధాల అనుకూలంగా ధాన్య సేకరణ జరిగిందన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు కూడా జమా అయ్యాయాన్నారు. బీజేపీ, బిఆరెస్ పార్టీలు రైతుల పట్ల మొసలి కన్నీరు కార్చుతున్నాయని, అధికారములో ఉండి రైతు సంక్షేమాన్ని మరిచారన్నారు. కేంద్రములో బీజేపీ సర్కారు నల్ల చట్టాలు తెచ్చి రైతన్న నడ్డివిరిచిందని, ఢిల్లీ భార్డర్లో వండలాది మంది రైతన్నల చావుకు కారణమైందన్నారు. బిఆరెస్ ప్రభుత్వంలో నష్టపోయిన రైతులకు ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వకుండా మొండి చెయ్యి చూపిందని, లక్ష రూపాయల రుణ మాఫికి కాలయాపన చేసి దశల వారీగా ఇచ్చిందని, ఆత్మ హత్యలు చేసుకున్న రైతులకు ఆదుకోవడములో విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు నెలాకరుకల్లా 2 లక్షల రుణ మాఫిని చేసి తీరుతుందన్నారు. రైతు సంక్షేమం కోసం రైతు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాననడం రైతుల పట్ల తమ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికి రైతు సంక్షేమ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమములో గ్రామ శాఖ అధ్యక్షులు పూదరి వేణు, గజ్జెల రాములు, ముస్కు ప్రభాకర్ రెడ్డి, పైడిపెల్లి సతీష్, మర్రి శ్రీనివాస్, గుళ్ల సదానందం, యువత నాయకులు గట్టు ప్రశాంత్, కల్వల రాజేశ్వర్ రెడ్డి, పైడిపెల్లి చంద్రయ్య, నవీన్, మధు సిలువెరీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూజరి సత్యనారాయణ గెలుపు ఖాయం

- భద్రాద్రిలో మార్మోగిన సన్నాహక సమావేశం
- హాజరైన ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య,
- గెలిపిస్తే పేద ప్రజల రుణం తీర్చుకుంటాను...అభ్యర్థి పూజరి సత్యనారాయణ



భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం/ మే 18 /అక్షరం న్యూస్ : వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి పూజారి సత్యనారాయణ గారిని విద్యావంతులు, మేధావులు 38వ సీరియల్ నంబర్ పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య పట్టభద్రులను కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో కేంద్రంలో జిల్లా అధ్యక్షులు మారెల్లివిజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ముఖ్య సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పూజరి సత్యనారాయణ గారితో కలిసి సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ ప్రగతి, రాష్ట్ర ప్రగతి కోసం శాసనాల ప్రతిపాదనల కోసం చర్చలు చేయాల్సిన పెద్దల సభకు శాసనమండలికి విద్యావంతులైన మేధావులను పంపాలని విద్యావంతులైన మేధావులను పంపాలని ఈ సందర్భంగా విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై పట్టు ఉండి ప్రభుత్వ ఉద్యోగంలో నిష్కల్మషంగా, నిజాయితీగా పనిచేసిన రిటైర్డ్ ఎంఈఓ,సామాజిక ఉద్యమకారులు పూజరి సత్యనారాయణ గారిని ఓటు అనే ఆయుధం ద్వారా విద్యావంతులు సపోర్ట్ చేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పూజరి సత్యనారాయణ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి గెలిపించినట్లయితే

పేద ప్రజల రుణం తీర్చుకుంటానని,విద్యా ఉద్యోగ పారిశ్రామిక రంగాల్లో ఉన్న లోటుపాట్లను సరిదిద్ది చట్టసభల ద్వారా పేదప్రజలగొంతునై వినిపిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శితోట రాజయ్య, రాష్ట్ర సలహాదారులు కృష్ణమోహన్, రాష్ట్ర కార్యదర్శి మాంచాలక్క,గ్రేటర్ వరంగల్ అధ్యక్షురాలు లక్ష్మి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, మహబూబాబాద్ జిల్లా మాలోతి వెంకటేష్,.ఉపాధ్యక్షులు మారెల్లి విజయకుమార్,జిల్లా కమిటీ సభ్యులు మండలాల అధ్యక్ష ప్రధానకార్యదర్శులు, సామాజిక ఉద్యమకారులు, ఆర్టీఐ కార్యకర్తలు, పలు సామాజిక కుల ప్రజా సంఘాల నాయకులు, తెలంగాణ

ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని సత్యనారాయణ గెలుపు కోసం పని చేస్తామని సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

# సమ్మె కాలపు జీతాలను ఇవ్వాలి



- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- గ్రామపంచాయతీ కార్మికులకు ఐఎఫ్టియు కార్మిక సంఘం నిరంతరం అండగా వుంటుంది
- భారత కార్మిక సంఘాల సమాక్య (ఐఎఫ్టియు) భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండ చరణ్

భద్రాద్రి కొత్తగూడెం/ భద్రాచలం /మే 18 /అక్షరం న్యూస్ : గ్రామపంచాయతీ కార్యాలయంలో (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికుల గత నిరవదిక సమ్మె కాలపు జీతాలను ఇవ్వాలని వారి సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యాలయ కార్యదర్శి అధికారికి వినత పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు (భారత కార్మిక సంఘాల సమాఖ్య) భద్రాచలం డివిజన్ కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ గత సంవత్సరం జూన్ నెలలో గ్రామపంచాయతీ కార్మికులు వారి హక్కుల కోసం సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె జరిగిందని అందులో భాగంగానే భద్రాచలంలోని గ్రామపంచాయతీ కార్మికులు కూడా సమ్మెలో పాల్గొన్నారనీ దాదాపుగా 25 రోజులపాటు కార్మికుల సమ్మెలో పాల్గొన్నారని అన్నారు వర్షాకాలం అయినందున కరోనా విపరీతంగా ప్రజలను పట్టిపీడిస్తున్న కారణంగా పరిసరాల పరిశుభ్రత అత్యవసరమైనందున అధికారుల సూచన మేరకు కార్మికులు విధుల్లోకి చేరారని అన్నారు ఒకపక్క ఇతర ప్రాంతాల్లో సమ్మె కొనసాగుతున్నప్పటికీ అధికారుల మాటను గౌరవించి కార్మికులు ప్రజల రక్షణ కోసం పాటుపడ్డారని అన్నారు చాలీచాలని జీతాలతోటి గ్రామపంచాయతీ కార్మికులు పడుతున్న బాధలు ఇబ్బందులు అధికారులకు తెలవనివి కాదని కాబట్టి అధికారులు మానవతా దృక్పథం తోటి ఆలోచించి సమ్మె కాలపు జీతాలను కార్మికులకు చెల్లించాలని కోరారు అంతేకాకుండా కార్మికులపై అధికారుల ప్రజా ప్రతినిధుల వేధింపులు ఆపాలని అక్రమ తొలగింపులు నిలిపివేయాలని ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని ఎనిమిది గంటల పని విధానం అమలు జరపాలని ప్రతినెల నిర్దేశిత తేదీల్లో జీతం అకౌంట్లో వేయాలని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని అన్నారు మున్సిపల్ వర్కర్స్ గ్రామపంచాయతీ వర్కర్లు చేసేది ఒకే రకమైన పని అని కాబట్టి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు జీవో నెంబర్ 61 ప్రకారం స్వీపర్లకు పదిహేను వేల రూపాయలు వేతనం ఇవ్వాలని పంపు ఆపరేటర్లకు డ్రైవర్లకు బిల్ కలెక్టర్లకు కారోబార్లకు ఎలక్ట్రీషన్స్కు 19500 ఇవ్వాలని హెల్త్ కార్డులు యూనిఫారాలు రక్షణ పరికరాలు ఇవ్వాలని పిఏపీఎఫ్ఐ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రమాదం జరిగితే కార్మికుడి కుటుంబానికి పది లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని బిల్ కలెక్టర్ కారోబర్ లను పంచాయతీ సహాయ కార్యదర్శిగా నియమించాలని డిమాండ్ చేశాడు ఈ కార్యక్రమంలో కార్మికులు సత్యం, నాగమణి, దుర్గా శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు

## మహానాడుకు దూరంగా టీడీపీ

తిరుపతి, మే 18 ((అక్షరం న్యూస్:

మహానాడు.. తెలుగుదేశం పార్టీకి పండుగ రోజు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా యాట మే 28న, దానికి ముందు ఒకరోజు, తరువాత ఒకరోజు పసుపు పండుగ మహానాడును నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. కానీ ఈసారి ఎన్నికల కారణంగా మహానాడు ను రద్దు చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో.. పార్టీ కార్యక్రమాన్ని నిర్వహించడం కుదరని పని. అందుకే రద్దు చేస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ఎన్టీఆర్ జయంతి సందర్భంగా టిడిపి మహానాడు ను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. మూడు రోజులపాటు నిర్వహించే మహానాడుకు భారీ సంఖ్యలో టిడిపి శ్రేణులు వస్తాయి. అధికారంలో ఉన్నా లేకున్నా పసుపు పండుగను ఘనంగా నిర్వహించడం కొనసాగుతూ వస్తోంది.అయితే ఈ ఏడాది ఎన్నికలతో ఆ ఆనవాయితీకి బ్రేక్ పడింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఈనెల 13న పోలింగ్ జరిగింది. జూన్ 4న ఫలితాలను వెల్లడించనున్నారు. గత మూడు నెలలుగా టిడిపి శ్రేణులు అహోరాత్రులు శ్రమించాయి. క్షణం తీరిక లేకుండా గడిపాయి. మరోవైపు మహానాడు పార్టీ కార్యక్రమం కావడంతో ఎన్నికల కోడ్ అడ్డంకి గా మారింది. ఈ తరుణంలో మహానాడు ను చంద్రబాబు రద్దు చేసినట్లు సమాచారం.2019 ఎన్నికల్లో సైతం ఇదే మాదిరిగా మహానాడు రద్దు అయ్యింది. ఆ ఎన్నికల్లో మే 23న ఫలితాలను ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ ఘోరంగా ఓడిపోయింది. దీంతో పార్టీ శ్రేణులు డీలా పడ్డాయి. దీంతో మహానాడును నిర్వహించలేదు. అటు తరువాత సంవత్సరం ప్రకాశం జిల్లాలో మహానాడు నిర్వహించి పార్టీకి జవసత్వాలు నింపారు చంద్రబాబు. 2014 ఎన్నికల్లో సైతం ఇదే పరిస్థితి ఎదురైంది. ఆ ఏడాది ఎన్నికల్లో గెలిచిన తర్వాత మహానాడు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కూటమి గెలిస్తే? చంద్రబాబు సీఎం బాధ్యతలు తీసుకున్నాక మహానాడును నిర్వహిస్తారని తెలుగుదేశం పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి

## పిఠాపురానికి మహర్దశ

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

ఏపీలో ఎన్నికల ఫలితాలపై ఇప్పుడిప్పుడే క్లారిటీ వస్తోంది. పోటీ చేస్తున్న అభ్యర్థులు దాదాపు ఒక స్పష్టతకు వస్తున్నారు.గట్టి ఫైట్ ఉన్న నియోజకవర్గాలను తప్పించి? మిగిలిన వాటిలో మాత్రం గెలుపు, ఓటమి పైన అభ్యర్థులు ఒక స్థిరమైన నిర్ణయానికి వస్తున్నారు. కానీ ఫలితం ప్రకటించే వరకు గెలుస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తూ ముందుకు సాగాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఏపీలో హాట్ నియోజకవర్గంగా పిఠాపురం నిలుస్తోంది. 2019 ఎన్నికల్లో రెండు చోట్ల ఓడిపోయిన పవన్? ఎన్నికల్లో మాత్రం పిఠాపురంలో అత్యధిక మెజార్టీతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని భావిస్తున్నారు. అదే సమయంలో వైసీపీ అభ్యర్థి వంగా గీత గెలుపు కోసం ఆ పార్టీ శ్రేణులు గట్టిగానే ప్రయత్నం చేశాయి.అయితే రాష్ట్రస్థాయిలో ఫలితం ఎలా వచ్చినా.. పిఠాపురం నియోజకవర్గానికికీలక పదవి ఖాయమని తేలుతోంది.ఇప్పటికే వంగా గీతను గెలిపిస్తే మంత్రితో పాటు డిప్యూటీ సీఎం చేస్తానని జగన్ హామీ ఇచ్చారు.ఆమెకు పాలనపరంగా కూడా మంచి అనుభవం ఉంది.2009లో తొలిసారిగా ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందారు. అటు తర్వాత జిల్లా పరిషత్ చైర్మన్ గా కూడా పనిచేశారు. రాజ్యసభ సభ్యురాలిగా, గత ఎన్నికల్లో ఎంపీగా కూడా ఎన్నికయ్యారు. ఒకవేళ ఆమె గెలిచి.. ఏపీలో వైసిపి అధికారంలోకి వస్తే వంగా గీత తప్పకుండా మంత్రి అవుతారు. డిప్యూటీ సీఎం పదవి తగ్గించుకుంటారు. కీలక పోర్టు పోలియో తప్పదు.ఒకవేళ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి పవన్ గెలుపొందితే.. ఆయనకు కీలకమైన మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కూటమిలో పవన్ పాత్ర కీలకం. చంద్రబాబు తప్పనిసరిగా ఆయనను క్యాబినెట్ లోకి తీసుకోవడం ఖాయంగా తేలుతోంది. అటు పిఠాపురంలో పవన్ గెలుపు పక్కా అన్న ప్రచారం జరుగుతోంది. వంగా గీత ఓడిపోయి వైసిపి అధికారంలోకి వచ్చిన ఆమెను మంత్రివర్గంలోకి తీసుకోవడం ఖాయం. అదే సమయంలో పవన్ ఓడిపోయి కూటమి అధికారంలోకి వచ్చినా.. ఆయనకు సైతం అదే స్థాయిలో ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే పవన్ 50 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందుతారని స్పష్టమైన సంకేతాలు ఉన్నాయి. అటు కూటమికి సైతం సానుకూల పవనాలు వీస్తున్నాయి. ఈ తరుణంలో పవన్ డిప్యూటీ సీఎం పదవి చేపడితే పిఠాపురం అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినా.. ఇటు టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినా పిఠాపురం నియోజకవర్గానికి మాత్రం కీలక పదవి దక్కే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## రైల్వేలో మరమ్మత్తులు...

**ఆలస్యంగా నడుస్తున్న ట్రైన్లు**

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

ఏపీలో రైళ్ల రాకపోకలు ఆలస్యంకావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పలు రైళ్లు ఆలస్యంగా రాకపోకలు సాగించడంతో స్టేషన్లలో పడిగాపులు కాశారు. విజయవాడ,గుంటూరు డివిజన్ పరిధిలో ట్రాక్ మరమ్మతుల కారణంగానే రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. వందేభారత్ రైలు దాదాపు 5 గంటలు ఆలస్యంగా బయలుదేరడంతో ప్రయాణికులు మండిపడ్డారు..విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఉదయం 5.45 గంటలకు బయలుదేరాల్సిన వందేభారత్ (20833) రైలు ఏకంగా ఐదు గంటలు ఆలస్యమైంది. సాంకేతిక సమస్యలు కారణంగా ఆలస్యమవుతుందని తెలిపిన అధికారులు... గంట గంటకు పొడిగించుకుంటూ ఉదయం 10.45 గంటలకు పట్టాలెక్కించారు. తెల్లవారుజామునే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 5 గంటలకుపైగానే స్టేషన్‌లో నిరీక్షించారు. ఆఫీసులకు వెళ్లాల్సిన వాళ్లు, ముఖ్యమైన పనులు ఉన్నవారంతా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేవాళ్లమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు (20834).. రాత్రి 8 గంటలకు బయలుదేరింది. పూర్తి సమాచారం ఇవ్వకుండా రైల్వే అధికారులు కాలయాపన చేశారని ప్రయాణికులు మండిపడ్డారు. ఇతర రైళ్లలో వెళ్లినా ఇంతకన్నా ముందే వెళ్లిపోయి ఉండేవాళ్లమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.రైళ్ల రాకపోకల్లో జాప్యం కారణంగా రైల్వే అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. భువనేశ్వర్ నుంచి ముంబై( వెళ్లాల్సిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020)ను కూడా భద్రతాపరమైన కారణాలు చూపి ఈ నెల 16 నుంచి 31 వరకు దాదర్ వరకు కుదించారు. అంతేకాదు జూన్ 1న ముంబై నుంచి బయల్దేరాల్సిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019)కూడా దాదర్( నుంచే బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. అంతేకాదు ఈ నెల 16వ తేదీ రాత్రి 11.20 గంటలకు విశాఖలో బయలుదేరాల్సిన విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్.. 17వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు బయలుదేరనుంది. ఈ నెల 16వ తేదీ రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సంత్రాగచ్చి-తాంబరం వేసవి ప్రత్యేక రైలు.. 17వ తేదీ ఉదయం 4 గంటలకు సంత్రాగచ్చిలో బయల్దేరుతుందని తెలిపారు. విజయవాడ, గుంటూరు డివిజన్ పరిధిలో ట్రాక్ మరమ్మతులు కారణంగా ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయడం జరిగింది. గుంటూరు - విశాఖ, గుంటూరు - రాయగడ, రాజమహేంద్రవరం -విశాఖ, మచిలీపట్నం- విశాఖ, కాకినాడ పోర్టు- విశాఖ రైళ్లు రద్దయ్యాయి.

# భారీగా కేంద్ర బలగాలు...

విజయవాడ, మే 18(అక్షరం న్యూస్:

ఫలితాల తర్వాత కూడా ఏపీలో అల్లర్లు జరుగుతాయా? కేంద్ర నిఘా వర్గాల హెచ్చరిక దేనికి సంకేతం? అధికార పార్టీ ఓడిపోయి అల్లర్లకు దిగుతుందా? లేకుంటే గెలిచామని అధికార పార్టీ విపక్షాలపై దాడి చేస్తుందా? ఇప్పుడు దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. ఏపీలో పోలింగ్ నాడు చాలా ప్రాంతాల్లో హింస రేగిన సంగతి తెలిసిందే. అది రెండు రోజులపాటు కొనసాగింది. ఎలక్షన్ కమిషన్ సీరియస్ చర్యలతో పాటు కేంద్ర బలగాలు రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. అయితే ఫలితాల తరువాత హింస మరింత పెరుగుతుందని కేంద్ర నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. దీంతో ఫలితాల తర్వాత రెండు వారాల పాటు కేంద్ర బలగాలు ఏపీలో కొనసాగనున్నాయి.ఏపీలో అధికార పార్టీ ఓడిపోతే.. ఆ ఫ్రస్టేషన్లో దాడులు జరిగే అవకాశం ఉంది. గెలిచామన్న ఆనందంలో తెలుగుదేశం కూటమి శ్రేణులు దాడులు చేసే అవకాశం ఉంది. అంటే కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల మేరకు వైసిపి ఓడిపోతుందన్న సంకేతాలు వచ్చాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే వైసీపీ నేతలు చాలా చోట్ల రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. చాలా చోట్ల రిగ్గింగ్ కూడా జరిగిందని ఆరోపణలు చేస్తున్నారు. అటు కొంతమంది సీనియర్లు చేస్తున్న వ్యాఖ్యలు భయంతో కూడుకున్నవే నన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. తాజాగా కేంద్రం అల్లర్లు జరిగే అవకాశం ఉందని అప్రమత్తం చేసిందంటే.. వైసీపీ అధికారం కోల్పోవడం ఖాయమని.. ఆ ఓటమిని జీర్ణించుకోలేక ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అల్లర్లకు తెగబడే ఛాన్స్ ఉందని హెచ్చరించి ఉండొచ్చునని విశ్లేషిస్తున్నారు.అదే సమయంలో మరో వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ఈ ఎన్నికల్లో అధికార పార్టీకి దీటుగా టిడిపి శ్రేణులు నిలబడ్డాయి. వైసీపీ అధికారంలోకి వస్తే టిడిపి శ్రేణుల అంతు చూద్దామని.. భావనలో వైసీపీ శ్రేణులు ఉండొచ్చని.. అందుకే కేంద్ర నిఘా వర్గాలు ఎన్నికల ఫలితాల తర్వాత ఏపీలో పలు ప్రాంతాల్లో దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించినట్లుగా మరికొందరు విశ్లేషిస్తున్నారు. అయితే ఫలితాలు తమకు అనుకూలంగా వస్తాయని కూటమి పార్టీల ధీమా.. అధికార వైసీపీ శ్రేణుల నుంచి వినిపించడం లేదు. పోలింగ్ పెరగడం, ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాలు వ్యతిరేకించడం, యువత పెద్ద ఎత్తున ఓట్లు వేయడంతో ఒక రకమైన అనుమానం అధికార పార్టీలో ఉంది. అందుకే కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికతో ఎక్కువగా వైసీపీ భయపడుతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

ఉత్తరాదిని మించి ఉత్తరాది రాష్ట్రాల మాదిరిగా రాజకీయ హింస చెలరేగింది. పోలింగ్ నాడు ప్రారంభమైన హింస.. రెండు రోజుల తర్వాత కూడా కొనసాగింది. ఎక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇప్పటివరకు ఫ్యాక్షన్ రాజకీయాలు సినిమాల్లో చూడడం తప్ప.. నేరుగా చూడడం ఇదే తొలిసారి. దీనిపై ఎలక్షన్ కమిషన్ కూడా సీరియస్ అయ్యింది. జాతీయస్థాయిలో ఏపీ పరువు పోయింది. కేంద్ర బలగాలు మోహరించాయి. ఫలితాలు వచ్చాక రెండు వారాలపాటు ఏపీలో ఈ బలగాలు కొనసాగనున్నాయి.ఏపీలో పరిస్థితి చూసి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కర్రలు రాళ్లతో దాడులు జరిగి ఆయా ప్రాంతాలు రక్తసిక్తంగా మారుతున్నాయి. చాలా ప్రాంతాలు యుద్ధ భూమిని తలపిస్తున్నాయి. జనాలు ఆందోళనతో ఉన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే.. ఫలితాలు వచ్చాక పరిస్థితి ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు. ఈ పరిస్థితికి ముమ్మాటికి పోలీస్ శాఖ తీరే కారణం. కొందరు అధికారులు ప్రభుత్వ పెద్దల అడుగులకు మడుగులొత్తడంతో ఈ పరిస్థితి వచ్చింది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. ముందుగానే పరిస్థితిని తమ అదుపులోకి తెచ్చుకొని ఉంటే హింస ఈ స్థాయిలో పెరిగి ఉండేది కాదు అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.గతంలో రాయలసీమకే పరిమితమైన ఫ్యాక్షన్.. రాష్ట్రవ్యాప్తంగా వెలుగు చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు బీహార్ కు ఉన్న అపవాదు ఏపీకి విస్తరించే అవకాశం కనిపిస్తోంది. పోలింగ్ నాడు చెదురు మదురు ఘటనలు చోటు చేసుకోవడం సర్వసాధారణం. కానీ పోలింగ్ నాడే పరిస్థితి అదుపు తప్పింది. తరువాత రెండు రోజులపాటు అలానే కొనసాగింది. ఎలక్షన్ కమిషన్ కలుగజేసుకోవడంతో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందోనన్న చర్చ నడుస్తోంది. ఏపీలో నెలకొన్న పరిస్థితులు, రానున్న రోజులను తలుచుకుంటే రాష్ట్రం ఎలా మారబోతుందోనన్న ఆందోళన రెట్టింపు అవుతోంది. కచ్చితంగా ఎలక్షన్ కమిషన్ తో పాటు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. లేకుంటే ఏపీలో జరిగే నష్టానికి మూల్యం తప్పదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# మూడు రోజులుగా ఓడిషా లోడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విస్తృత ప్రచారం

**భువనేశ్వర్**మే18(అక్షరం న్యూస్:

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు గత బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు ఒరిస్సా రాష్ట్రంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గత మంగళవారం రాత్రి ఆయన నేరుగా ఢిల్లీకి వెళ్లారు. బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీతో ప్రత్యేక విమానంలో ఒరిస్సా రాష్ట్రంలోని బోలాంగిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ప్రచారం నిర్వహించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన రాహుల్ గాంధీతో కలిసి పాల్గొన్నారు. అదేరోజు రాహుల్ గాంధీతో కలిసి ఆయన నేరుగా ఢిల్లీకి చేరుకున్నారు. గురువారం తిరిగి ఒరిస్సా రాజధాని భువనేశ్వర్ కు చేరుకుని స్థానిక పిసిసి నేతల కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా నిర్వాహకులతో ఎన్నికల్లో వ్యవహరించాల్సిన వ్యూహాలను చర్చించారు. గురువారం ఒరిస్సా రాష్ట్రంలోని ఫుల్బని పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన బహిరంగ సభలో ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఒరిస్సా పిసిసి అధ్యక్షుడు శరత్ పట్నాయక్, ఏఐసిసి నాయకులు భక్త చరన్ దాస్, ఆర్. సి. కుంతియా కలిసి డిప్యూటీ సీఎం పాల్గొన్నారు.

మొదటి దశలో ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడ, భువనేశ్వర్, కేరళ రాష్ట్రంలోని పాల్ ఘాట్ జిల్లాలోని అలత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ప్రచారం నిర్వహించారు

## పది మంది డీఆర్జీ జవాన్ల హిట్ లిస్ట్ జాబితాను విడుదల చేసిన మావోయిస్టులు

**బీజాపూర్లోని భైరామ్ఘడ్ ప్రాంతంలో చెట్లకు పోస్టర్లు అంటించిన మావోయిస్టులు**

బీజాపూర్ మే18(అక్షరం న్యూస్:

పదిమంది డీఆర్జీ పోలీసుల హిట్ లిస్ట్ జాబితాను మావోయిస్టులు పోస్టర్ల లేఖ ద్వారా విడుదల చేసారు. అమాయక గ్రామస్తులను, కూలీలను కూడా పోలీసులు బెదిరించినట్లు మావోయిస్టులు ఆ పోస్టర్ లలో పేర్కొన్నారు. బైరనీగడ్ లో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను ఆపివేసి, ఎవరి ఇళ్లకు వాళ్లు సురక్షితంగా వెళ్లిపోవాలని లేదా తగు చర్యలు తప్పవని సిపిఐ మావోయిస్టు పార్టీ హెచ్చరించింది. ప్రభుత్వ భవనాల గోడలపై మావోయిస్టులు ప్రజాస్వామ్య వ్యతిరేక నినాదాలు రాసారు. చెట్లకు కరపత్రాలు అతికించారు. ఛత్తీస్గఢ్లోని బీజాపూర్ జిల్లాలోని ఓ గ్రామంలో మావోయిస్టులు ప్రభుత్వ భవనాల గోడలపై త్రివర్ణ పతాకాలలో నల్ల రంగుతో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నినాదాలు రాసారు .

## సీరియల్ నటుడు చందు ఆత్మహత్య





రంగారెడ్డి మే18(అక్షరం న్యూస్: రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో అల్కాపూర్ కాలనీలో సీరియల్ నటుడు చందు ఆత్మహత్య చేసుకున్నారు. చందు త్రినయిని తో పాటు పలు సీరియల్స్ లో నటించాడు. చందుకు భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. తోటి నటి పవిత్ర ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఆరేళు గా చందుకు టీవీ నటి పవిత్ర జయరాంతో వివాహేతర సంబంధం వున్నట్లు సమాచారం. చందు 2015లో శిల్పను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ప్రస్తుతం రాధమ్మ పెళ్లి, కార్తీక దీపం సీరియల్స్ లో చందు నటిస్తున్నాడు. పోలీసులు ఆత్మహత్య కు కారణాలు పై విచారణ చేస్తున్నారు.

## కుటుంబ కలహాలతో తల్లి, ఇద్దరు కూతుర్ల హత్య

ఖమ్మంమే18(అక్షరం న్యూస్:



ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలరవుపేట గ్రామంలో విషాదం నెలకొంది. క్షణికావేశం ముగ్గురి ప్రాణాలు బలి తీసుకుంది. గ్రామానికి చెందిన పిట్టల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన తల్లిని ఇద్దరు కూతుర్ని నరికి చంపిన వైనం కలకలం రేపింది.ఆర్థిక ఇబ్బందులు ,కుటుంబ కలహాలు కారణంగా కుటుంబ సభ్యులను చంపి పరారు అయ్యాడు. తల్లి పిట్టల పిచ్చమ్మ(60), ఇద్దరు. కూతుళ్లు పిట్టల నీరజ(10),పిట్టల ఝాన్సీ(6) ను హతమార్చాడు. పోలీసులు నిందితుడికోసం గాలిస్తున్నారు.

## కారు, లారీ ఢీ..నలుగురు మృతి

అనంతపురం :మే18(అక్షరం న్యూస్:

గుత్తి మండలం బాచుపల్లి గ్రామ సమీపంలోని 44 నెంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు లారీ ఢీకొన్న ఘటనలో నలుగురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారి పరిస్థితి విషమంగావుంది. మృతులు అనంతపురం రాణి నగర్ వాసులుగా గుర్తించారు. క్షతగాత్రులను గుత్తి ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

# ఢిల్లీలో ఫ్రెండ్ షిప్.. గల్లీలో వార్ షిప్

కోల్ కత్తా, మే 18, (అక్షరం న్యూస్:

ఒకళ్ళు పొత్తు అంటారు. ఇంకొకరు లేదు లేదు. మా దారి మాదే అంటారు. ఇలా ప్రారంభం నుంచి అదే మాట. సమావేశాలలో వేదిక పంచుకుంటారు. సమావేశం ముగిసిన తర్వాత కత్తులు దూసుకుంటారు. ఇప్పుడు ఈ ఉపోద్ఘాతం మొత్తం ఎందుకయ్యా అంటే.. పార్లమెంట్ ఎన్నికల ముంగిట.. కాంగ్రెస్ తో సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన “ఇండియా” కూటమిలో ఇదంతా జరుగుతున్న తతంగం కాబట్టి. తాజాగా మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అస్పష్ట స్నేహాన్ని వెల్లడించగా.. కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలు.. అందులో ఉన్న అతుకుల బొంతను బయటపెట్టాయి. ఇదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఆయాచిత బలాన్ని చేకూర్చాయి.పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హల్దియాలో ఓ ఎన్నికల ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. “ భారతీయ జనతా పార్టీ నిధులతో కాంగ్రెస్, సీపీఐ(ఎం) ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయి. వారికి ఎట్టి పరిస్థితిలో ఓటు వేయద్దు. వారితో బెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండదు. ఢిల్లీలో మాత్రం ప్రభుత్వ ఏర్పాటుకు సహకరిస్తాం. నేను ఇండియా కూటమిలో భాగస్వామిని. దానికి మా పార్టీ మద్దతు ఇస్తుంది. ఇందులో ఎటువంటి అపార్థం లేదని” మమతా బెనర్జీ వివరించారు. మమతా బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేయడమే ఆలస్యం.. కాంగ్రెస్ పార్టీ నేత అధీర్ రంజన్ మండిపడ్డారు. “ ఆమె కూటమి నుంచి వెళ్లిపోయారు. ఆమెపై మాకు నమ్మకం లేదు. ఆమె కూడా బిజెపి వైపు వెళ్లొచ్చు. కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేయాలని చూశారు. మా పార్టీకి 41 నుంచి సీట్లు రావని ఆమె మాట్లాడారు. ఇప్పుడేమో కాంగ్రెస్



పార్టీ, కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పారు. గతంలో ఇదే ర్యాలీలో మమతా బెనర్జీ పాల్గొన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ సీటు కోసం బిజెపిని విమర్శించారు. ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఆ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ గెలిచినప్పటికీ.. మమతా బెనర్జీ ఓడిపోయారు. ఆ స్థానంలో బిజెపి అభ్యర్థి సువేందు అధికారి గెలిచారని” అధీర్ రంజన్ పేర్కొన్నారు.మమత, ఆధీర్ వ్యాఖ్యల నేపథ్యంలో బిజెపి నాయకులు స్పందించారు. ఇండియా కూటమి అంటేనే అతుకుల బొంత అని.. దానిని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. “కూటమిలో ఎవరెవరు ఎటువైపు ఉంటారో తెలియదు. పైగా వీరు ప్రజాస్వామ్యం గురించి చెబుతుంటారు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకొని.. ఎటువంటి సందేశాలు ఇస్తున్నారు వారికే తెలియాలి” అంటూ బిజెపి నాయకులు విమర్శిస్తున్నారు.. మరో మూడు దశల్లో పోలింగ్ ఉన్న నేపథ్యంలో.. ఇండియా కూటమిలో ఇంకెన్ని లుకలుకలు బయటపడతాయో వేచి చూడాల్సి ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు మమత చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విపక్షాలను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఇండియా కూటమి ఎలా ఉంటుందో.. మమత మాటల ద్వారా తెలిసిపోతుందని చురకలు అంటించారు.

# ఏఐ వర్సెస్ ఏలియన్స్




హైదరాబాద్, మే 18, (అక్షరం న్యూస్:

శాస్త్ర సాంకేతిక రంగాలు సరికొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇప్పటికే కొత్త కొత్త పరిజ్ఞానాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇవన్నీ మనిషి జీవితాన్ని సమూలంగా మార్చేస్తున్నాయి. ఇప్పటికే ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక రంగాన్ని ఒక ఊపు ఊపుతోంది. దీనివల్ల అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెను మార్పులకు కారణమవుతోందనుకుంటే.. ఇప్పుడు సరికొత్తగా ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ తెరపైకి వచ్చింది. అయితే ఇది మనిషి రూపొందించింది అయినప్పటికీ.. అంతకు మించిన తెలివితేటలతో పనిచేస్తుందట. మనిషి అర్థం చేసుకునే దానికంటే రెట్టింపు వేగంతో కార్యకలాపాలు సాగిస్తుందట. అభివృద్ధి, నాగరికత పెరుగుదలలో కీలకమైన దశతో ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ సమానంగా ఉంటుందట. ఇది ఇతర గ్రహాలపై మనగడ సాధ్యమా? కాదా? అనే అంశాలను కూడా కనుక్కుంటుందట. అయితే గ్రహాంతర నాగరికతల రహస్యాలను, వాటి వెనుక ఉన్న చిక్కుముళ్లను ఈ సాంకేతిక పరిజ్ఞానం విప్పలేదట. అందువల్లే దీనిని ఉపయోగించి గ్రహాంతరవాసుల మనుగడను, పుట్టుకను శాస్త్రవేత్తలు కనిపెట్టలేకపోతున్నారట.మంచి వెనుక చెడు ఉన్నట్టు.. ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ వల్ల తీవ్రంగా నష్టాలు ఉంటాయట.

ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పలు దేశాలు తమ సైనిక అవసరాలకు అటానమస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిస్టం ను అభివృద్ధి చేస్తే.. అది అంతిమంగా నాగరికత నాశనానికి కారణమవుతుందట. అచ్చం హాలీవుడ్ సినిమాల్లో చూపించినట్టు.. పరిస్థితి మారిపోతుందట. ఇక ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్ ద్వారా టెక్నాలజీ అడ్వాన్స్మెంట్ సహాయంతో ఇతర గ్రహాలపై మనుషుల జీవనాన్ని సాధ్యం చేస్తే ఎలా ఉంటుందనే అన్వేషణ తెరపైకి వచ్చింది. అయితే దీన్ని ఉపయోగించి చేసే పరిశోధనకు పరిమితులు ఉండడంతో.. పరిశోధకులు ఆలోచనలో పడ్డారు. ఒకవేళ ఆ దిశగా పరిశోధన చేస్తే వచ్చే ఫలితాలు, వాటి పర్యవసనాలు.. అవి మనిషి జీవితంపై చూపించే ప్రభావం.. వంటి వాటిని పరిగణలోకి తీసుకొని పరిశోధకులు పునరాలోచనలో పడ్డారట. ఒకవేళ అలాంటి ప్రయోగాలు చేస్తే అవి మనిషి జీవితానికి చేసే మంచి కంటే, చెడే ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారని తెలుస్తోంది.సాంకేతిక పరిజ్ఞాన విస్తృతిలో భాగంగా హ్యూమానిటీ అనేది కీలకమైన దశలో ఉంది. అలాంటప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బాధ్యతాయుతమైన వృద్ధిని నమోదు చేయాలని పరిశోధకులు భావిస్తున్నారు. సెర్చ్ ఫర్ ఎక్స్ ట్రా టెరెస్ట్రియల్ ఇంటలిజెన్స్ ను ఒక ఫ్రేమ్ వర్క్ గా ఉపయోగించడం, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగంతో భవిష్యత్తును బాధ్యతాయుతంగా తీర్చిదిద్దుకోవడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. ఒకవేళ ఆ అంశాల పరిధికి మించి పరిశోధనలు చేస్తే.. అది అంతిమంగా చెడుకు దారితీస్తుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల విస్తృతిని దృష్టిలో పెట్టుకొని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతున్నారు.

# 10 శాతం పెరిగిన రియల్ ఎస్టేట్ ధరలు



హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్:

హైదరాబాద్ స్థిరాస్తి వ్యాపారానికి చిరునామాగా మారింది. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక వెలుగు వెలిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోతుందని.. ఇళ్లకు గిరాకీ ఉండదని రకరకాల ప్రచారాలు తెరపైకి వచ్చాయి. అయితే అవన్నీ ఊహాజనితాలని తేలిపోయింది. ఎందుకంటే హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారం సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఇళ్లకు, ప్లాట్లకు, ఫ్లాట్లకు ధరలు పెరగడం.. హైదరాబాద్ కు ఉన్న డిమాండ్ ను తెలియజేస్తోంది. ఇప్పటికే బెంగళూరు నగరంలో సగటున ఇళ్ల ధరలు 19 శాతం పెరగగా.. అదే దారిలో హైదరాబాద్ పయనిస్తోంది. దేశంలోని టాప్? 8 నగరాలలో ఇళ్ల ధరలు అధికంగా పెరగగా.. అందులో బెంగళూరు మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్ కూడా టాప్ -8 జాబితాలో కొనసాగుతోంది.. పెరిగిన ధరలకు సంబంధించి క్రెడాయ్ అండ్ కొరియర్స్ లియాసెస్ ఫోరాస్ ఒక నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం హైదరాబాదులో ఇళ్ల ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి.మనదేశంలో ఈ సంవత్సరానికి సంబంధించి జనవరి నుంచి మార్చి త్రైమాసికంలో టాప్ 8 నగరాలలో సగటున 10% ఇళ్ల ధరలు పెరిగాయి.. రెసిడెన్షియల్ ఏ రియల్ ఎస్టేట్ వ్యాపారంపై సానుకూల దృక్పథం కొనసాగుతున్న నేపథ్యంలో ధరలు పెరుగుతున్నట్టు తెలుస్తోంది.. బెంగళూరు నగరంలో ఈ ఏడాది ఇళ్ల ధరలు, గత ఏడాదితో పోలిస్తే 19 శాతం పెరిగాయి. ఇళ్ల ధరల పరంగా దేశం మొత్తం మీద ఈ 8 నగరాలలోనే అధికంగా ఉండడం విశేషం. బెంగళూరులోని ఫెరిఫెరీ అండ్ ఔటర్ ఈస్ట్ మైక్రో మార్కెట్ లో ఇళ్ల ధరలు 32 శాతం పెరిగాయి. దీని తర్వాత ఫెరిఫెరీ అండ్ అవుటర్ నార్త్ మార్కెట్లో సగటున 18% ధరలు పెరిగాయి. ఇక వైట్ ఫీల్డ్, కె ఆర్ పురం వంటి ప్రాంతాలలో త్రిబుల్ బెడ్ రూమ్, క్వాడ్రా ఫుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది..బెంగళూరు అనంతరం ఢిల్లీలోని ఎన్ సీ ఆర్ ప్రాంతంలో ఇళ్ల ధరలు 16 శాతం పెరిగాయి. ధరలపరంగా ఇది రెండవ స్థానంలో ఉంది. ద్వారక ఎక్స్ ప్రెస్ వే పరిధిలో ఇళ్ళ ధరలు 23% పెరిగాయి. హైదరాబాదులో గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఇళ్ల ధరలు సగటున తొమ్మిది శాతం పెరిగాయి. ఇక గత ఎడాది అక్టోబర్ డిసెంబర్ సమయంలో పోలిస్తే ఇప్పుడు రెండు శాతం మాత్రమే పెరుగుదల కనిపించింది. ఇక గత త్రైమాసికంతో పోల్చితే ప్రస్తుత త్రైమాసికంలో ధరలు పెరిగిన జాబితాలో అహ్మదాబాద్ తొలి స్థానంలో ఉంది. ఇక్కడ ఏడు శాతం మేర ధరలు పెరిగాయి..కోల్ కతా లో ఇళ్ల ధరలు రెండు శాతం తగ్గాయి. చెన్నైలో ఎటువంటి మార్పులు లేవు. ఏడాది ప్రాతిపదికన చూసుకుంటే ఇళ్ల ధరలు చెన్నైలో నాలుగు శాతం పెరిగాయి.విద్య, ఉద్యోగం, కెరియర్ ఈ మూడు అంశాలకు ప్రాధాన్యం పెరగడంతో చాలామంది నగరాలలో జీవించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. పైగా నగరంలో భూమి మీద పెట్టుబడి పెడితే అనేక రెట్ల లాభాలు కళ్ళ చూసే అవకాశం ఉండడంతో చాలామంది ప్లాట్లు, ఫ్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక బ్యాంకులు కూడా రుణాల మంజూరు ను సులభతరం చేయడంతో గృహాల కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి.

## ఆగివున్న లారీని ఢీకొన్నకారు..పలువురికి గాయాలు

నెల్లూరు(అక్షరం న్యూస్:

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం, టపాతోపు సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది.ఘటనలో బాపట్ల జిల్లాకు చెందిన పలువురికి గాయాలు అయ్యాయి. 45వ నెంబర్ జాతీయ రహదారి పై కొడవలూరు మండలం, టపాతోపు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని మారుతి ఎర్టిగా కారు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తో సహా ఏడుమందికి. తీవ్రగాయాలు .ప్రాణాపాయస్థితిలో ఉన్న క్షతగాత్రులను మెడికల్ స్టూడెంట్ సుకన్య వెంటనే ప్రాథమిక చికిత్స అందించి ,క్షతగాత్రులను దగ్గరుండి 108 లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాపట్ల జిల్లా కాజీ పాలెం కు చెందిన క్షతగాత్రులు బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్ట రామాలయం కి వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి స్వస్థలాలకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

## బెర్తుల కోసం లాబీయింగ్

హైదరాబాద్, మే 18 (అక్షరం న్యూస్:

రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో బెర్తల కోసం అప్పుడే లాబీయింగ్ మొదలైందా? చోటు దక్కని సీనియర్లు ఈసారి మంత్రి పదవులపై కన్నేశారా? దీనికోసం ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని భావిస్తున్నారా? వివిధ జిల్లాల నుంచి కీలక నేతలు రేసులో ఉన్నారా? తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం కాంగ్రెస్ పెద్దలతో పలువురు సీనియర్లు మంతనాలు జరిపినట్టు సమాచారం. కాకపోతే లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తర్వాత ఈ అంశం ఓ కొలిక్కిరావచ్చని తెలుస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే జూన్ చివరలో కేబినెట్ విస్తరణ ఉంచవచ్చనే సంకేతాలు లేకపోలేదు.ఈసారి ఏ జిల్లాకు ప్రాధాన్యత ఇస్తారనేది తెలంగాణ కాంగ్రెస్‌లో హాట్ హాట్‌గా చర్చ జరుగుతోంది. రాజ్యాంగం పద్ధతి ప్రకారం సీఎంతో కలిసి 18 మందికి మించరాదు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో కలిసి 12 మంది మంత్రులున్నారు. మరో ఆరుగురు ఛాన్స్ ఉందన్నమాట. హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఛాన్స్ ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీసీ, ముదిరాజ్, మైనార్టీ వర్గాలతో కలిసి మొత్తం ఆరుగురికి అవకాశం ఇవ్వడం ఖాయం.లోక్‌సభ ఎన్నికల ఫలితాలు, ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగా పదవులు ఉంటాయని గతంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు చెప్పుకొచ్చారు. సరైన పనితీరు కనబరచని మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. రేవంత్ కేబినెట్‌లో ఖమ్మం నుంచి ముగ్గురు మంత్రులున్నారు. నల్గొండ, వరంగల్, కరీంనగర్ నుంచి ఇద్దరేసి మంత్రులున్నారు.ఖమ్మం నుంచి భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరావు ఉన్నారు. నల్గొండ నుంచి ఉత్తమ్‌కుమార్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క, కరీంనగర్ నుంచి పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు ఉన్నారు. ఇక హైదరాబాద్ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేలు ఎవరు లేరు. బీఆర్ఎస్ నుంచి ఎవరైనా వస్తే వారికి ఛాన్స్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు.ఇక రంగారెడ్డి జిల్లా విషయానికొస్తే పరిగి ఎమ్మెల్యే రామ్‌మోహన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ రేసులో ఉన్నారు. ఈ వ్యవహారమంతా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జులైలో జరగాలి. కానీ ఆ సమయంలో జరిగే ఛాన్స్ లేదు. ఎందుకంటే రైతుబంధు పథకానికి నిధులు ఆగస్టులో వేస్తామని రేవంత్ సర్కార్ చెప్పింది. ఆ లెక్కన చూస్తే సెప్టెంబరులో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగడం ఖాయమని పలువురు నేతలు చెబుతున్నమాట.

## అన్నదాతలను ఆగమాగం చేసిన రైతన్న

నిజామాబాద్, మే 18 (అక్షరం న్యూస్:

పంట వేసిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చేవరకు, చిన్నపాటి యుద్ధాన్ని చేసే రైతన్న.. తీరా పంట చేతికి వచ్చాక దళారుల దగ్గర పోరాడలేక ఓడిపోతున్నాడు. తాజాగా అకాల వర్షాలు రైతన్నను నిండా ముంచేస్తున్నాయి. చేతికందొచ్చిన పంట కళ్లెదుటే మట్టిపాలు కావడంతో గుండెలు బాదుకుంటున్నారు అన్నదాతలు. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో భోరుమంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్దఎత్తున ధాన్యం వర్షార్పణమైంది. వానల నుంచి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు రైతులు.దంచికొడుతున్న వానలు అన్నదాతలను నట్టేట ముంచాయి..నోటి కాడి బుక్క నీటిపాలడంతో రైతన్నలు దిగులుతో తలలు పట్టుకుంటున్నారు. కళ్ళాల్లో ఆరబోసిన ధాన్యం వరదల్లో కొట్టుకుపోతుంటే, రైతన్న గుండె చెరువు అవుతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో గతవారం రోజుల నుండి కురుస్తున్న వడగండ్ల వానల ప్రభావంతో వివిధ పంటలకు ఊహించిన విధంగా నష్టం వాటిల్లింది. వేసవిలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం అన్నదాత గుండె చేరువయ్యేలా చేసింది.కరువు మేఘాలు వెక్కిరిస్తున్నా కష్టాలకు ఎదురీది పంటలు సాగు చేసిన రైతులు ఇప్పుడు తల్లడిల్లిపోతున్నారు.. పగబట్టిన ప్రకృతి రైతులు కుమిలి పోయేలా చేస్తోంది. చేతికి వచ్చిన పంట అమ్ముకునే సమయంలో దరిద్రపుగొట్టు వర్షాలు అన్నదాతలను నట్టేట ముంచాయి. వడగండ్ల వానలు రైతులకు ఊహించని విధంగా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వడగండ్ల వానల ప్రభావంతో వరి పంటకు ఊహించని విధంగా నష్టం వాటిల్లింది..వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో వరి పంట మొత్తం వర్శర్పణమైంది..ఇప్పటికే కోతలు పూర్తయి అమ్మకం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.. చాలా ప్రాంతాల్లో కల్లాల్లో దాన్యం ఆరబోసుకొని అమ్ముకోవడానికి ఎదురుచూస్తున్నారు. మరి కొంతమంది రైతులు రోడ్లపై దాన్యం ఆరబోసుకుని అమ్ముకోవడానికి కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నారు. వడగండ్ల వానల నుండి పంటను కాపాడుకోవడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు.పార్లమెంట్ ఎన్నికల కారణంగా ధాన్యం కొనుగోలులో కొంత అంతరాయం ఏర్పడింది. ఆ జాప్యం ఇప్పుడు రైతుల గుండె చేరువయ్యాలా చేస్తోంది. చేతికొచ్చిన పంట వర్షార్పరం అయిపోతుండడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. అక్కడా.. ఇక్కడన్న తేడా లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దడంతో రైతులు తల్లడిపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.మరోవైపు మామిడి పంటకు కూడా ఇదే రకమైన పరిస్థితి నెలకొంది ఈదురుగాళ్ల ప్రభావంతో మామిడిపాటంతా నేలరాలిపోయి రైతులు ఆందోళన చెందుతున్నారు.. మిర్చి పంట కూడా దాదాపుగా తుడిచి పెట్టుకుపోతుంది. కళ్ళాల్లో ఆరబోసిన మిర్చి పంటనీతా తడిసి ముద్దమవడంతో రైతులు దిగులుతో తలలు పట్టుకున్నారు. వడగండ్ల వాన ప్రభావంతో తీవ్ర నష్టాన్ని చూసిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. మరోవైపు వర్షాల ప్రభావంతో ఏర్పడే ఇబ్బందుల నుండి ప్రజలను రక్షించడం కోసం వరంగల్ నగరంతో పాటు జిల్లా కేంద్రాలలో అధికారులు టోల్ ఫ్రీ నెంబర్లను ప్రకటించారు అధికారులు

## నయీంనగర్ నాలా పనులకు అధికారులు డెడ్ లైన్

కరీంనగర్, మే 18 (అక్షరం న్యూస్:

ఓరుగల్లు నగరంలోని వరంగల్?కరీంనగర్ హైవేపై కీలకమైన నయీంనగర్ నాలా పనులకు అధికారులు డెడ్ లైన్ ఫిక్స్ చేశారు. దాదాపు రూ.90 కోట్ల నిధులతో నయీంనగర్ నాలా డెవలప్ మెంట్, బ్రిడ్జి పనులకు శ్రీకారం చుట్టగా, జూన్ 15లోగా వర్క్స్ అన్నీ కంప్లీట్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నారు.ఇప్పటికే దానికి సంబంధించిన పనులు స్టార్ట్ కాగా, అధికారులు నిర్దేశించుకున్న ప్రకారం ఇంకా నెల రోజుల సమయం మాత్రమే ఉంది. ఓ వైపు అకాల వర్షాలు దంచుతుండటంతో తరచూ పనులకు ఆటంకం కలుగుతోంది. దీంతో వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి నయీంనగర్ నాలా డెవలప్ పనులు పూర్తవుతాయో లేదోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.గ్రేటర్ వరంగల్ నగరంలో హనుమకొండ పరిధిలోని నయీంనగర్ నాలా ఆక్రమణల పుణ్యమాని ఇరుకుగా మారింది. దీంతో వర్షాలు పడినప్పుడల్లా వడ్డేపల్లి చెరువు నుంచి వచ్చే వరద నీటితో ఆ చుట్టు పక్కల ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. వందల కాలనీలు నీట మునిగి జనాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.ఈ క్రమంలోనే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ 2021 ఏప్రిల్ 12న వరంగల్ నగర పర్యటనకు వచ్చారు. వందల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అందులో ప్రధానంగా నయీంనగర్ బ్రిడ్జి పునర్నిర్మాణంతో పాటు నాలా రిటైనింగ్ పనులు కూడా ఉన్నాయి.

# సానియాపై పాక్ నటుడి కామెంట్స్‌పై నెటిజన్ల ఫైర్

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:



పాకిస్తాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్, నటి సనా మాలిక్ ప్రస్తుతం హనీమూన్ మూడ్ లో ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో వీరి వివాహం జరగ్గా, ఇప్పుడు అమెరికాలో హనీమూన్ ఎంజాయ్ చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారీ కపుల్. మరోవైపు షోయబ్ మాలిక్ తో విడాకుల అనంతరం సానియా మీర్జా దుబాయ్ కి షిఫ్ట్ అయింది. ప్రస్తుతం తన కుమారుడి ఆలనా పాలనలో బిజిబిజీగా ఉంటోంది తప్పితే షోయబ్ మూడో పెళ్లి ముచ్చట గురించి ఎలాంటి కామెంట్లు చేయలేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. స్ఫూర్తిదాయకమైన సందేశాలను షేర్ చేస్తూ తనకు తాను ధైర్యం చెప్పుకుంటోంది. అయితే షోయబ్ తో విడాకుల తర్వాత సానియా కూడా రెండో పెళ్లి చేసుకుంటుందని ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై సానియా కానీ, ఆమె కుటుంబ సభ్యులు కానీ పట్టించు కోలేదు. అయితే ఇలాంటి పుకార్లు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఓ పాకిస్థానీ నటుడు షోయబ్ మూడో పెళ్లి చేసుకున్నట్లు, సానియా మీర్జా కూడా రెండో పెళ్లి చేసుకోవాలని సలహా ఇచ్చాడు. మళ్లీ పెళ్లి చేసుకోమని సానియా మీర్జాకు పాక్ ప్రముఖ నటుడు నబీల్ జాఫర్ సలహా ఇచ్చాడు. ఓ పాకిస్థానీ టీవీ షోలో అతను ఈ కామెంట్లు చేశాడు. దీనికి సంబంధించిన వీడియో, కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'ఎవరైనా మహిళ విడాకులు తీసుకుంటే కచ్చితంగా మళ్లీ పెళ్లి చేసుకోవాల్సిందే. మహిళ జీవితం ఒక వ్యక్తితో ముగియకూడదు. మీకంటూ ఓ జీవిత భాగస్వామి ఉండాలి. షోయబ్ మాలిక్ మూడో పెళ్లి చేసుకున్నాడు. ఇప్పుడు సానియా మీర్జా కూడా రెండో పెళ్లి చేసుకోవాలి' అని జాఫర్ కామెంట్స్ చేశాడు. అయితే ఈ పాకిస్థానీ నటుడు ఇచ్చిన సలహా అభిమానులు, నెటిజన్లకు అస్సలు నచ్చలేదు. దీంతో జాఫర్ పై తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. ' సానియా మీర్జా వ్యక్తిగత జీవితం గురించి చాలా తక్కువ మాట్లాడండి. ఆమె ఏమి చేయాలి? ఏమి చేయకూడదు అనే దానిపై మిమ్మల్ని సలహా అడిగారా? పెళ్లి చేసుకోవాలా వద్దా అన్నది ఆమె నిర్ణయం' అంటూ పాక్ నటుడికి హిత బోధ చేశారు నెటిజన్లు.

# ఆ క్షణంలో నా గుండె బద్దలైంది: కోహ్లి

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:




సూపర్ ఫామ్‌లో ఉన్న విరాట్ కోహ్లి ఐపీఎల్‌లో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానంలో ఉండి ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. 13 మ్యాచ్‌ల్లో 66 సగటు, 155 స్ట్రైక్‌రేటుతో 661 పరుగులు చేశాడు. ఇదే జోరులో ఇవాళ చెన్నై సూపర్ కింగ్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో చెలరేగి ఆర్సీబీని ప్లేఆఫ్స్‌కు చేర్చాలని కోహ్లి కసిగా ఉన్నాడు.

అయితే తన కెరీర్‌లో రెండు సార్లు హార్ట్ బ్రేక్ అయ్యిందని కోహ్లి తెలిపాడు. ఒకే ఏడాదిలో ఆ రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయని వివరించాడు. 2016 టీ20 వరల్డ్ కప్‌లో భారత్ సెమీఫైనల్‌లో ఓటమిపాలవ్వడం, అదే ఏడాది ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌లో ఓడి కప్‌ను చేజార్చుకోవడం తనని ఎంతో బాధించిందని తెలిపాడు.ఐపీఎల్-2016లో కోహ్లి 16 మ్యాచ్‌ల్లో 973 పరుగులు చేశాడు. నాలుగు సెంచరీలు, ఏడు హాఫ్ సెంచరీలు బాదాడు. 81 సగటు, 152 స్ట్రైక్‌రేటుతో రన్స్ సాధించాడు. ఓ సీజన్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడి కోహ్లి నెలకొల్పిన 973 పరుగుల రికార్డు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ఇక ఆ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్‌లో అయిదు మ్యాచ్‌ల్లో విరాట్ 273 పరుగులు చేశాడు. భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. కానీ టైటిల్ అందుకోలేకపోయాడు. తాజాగా ఈ సంఘటనలను కోహ్లి గుర్తు చేసుకున్నాడు. "నా జీవితంలో, 2016లో నా గుండె రెండు సార్లు బద్దలైంది. ఒకటి టీ20 వరల్డ్ కప్ అయితే, రెండోది ఐపీఎల్ ఫైనల్. టీ20 ప్రపంచకప్‌లో ఓడిన బాధను అధిగమించడానికి నాకు ఎన్నో రోజుల సమయం పట్టింది. ఎందుకంటే అప్పుడు భారత్‌కు ట్రోఫీని అందించాలనే కసితో ఎంతో పోరాడాను" అని కోహ్లి అన్నాడు. కాగా, మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న టీ20 వరల్డ్ కప్‌లో గొప్పగా రాణించడానికి ప్రయత్నిస్తా అని కోహ్లి తెలిపాడు. తనలో ఉండే కసినే తనని ముందుకు నడిపిస్తుందని చెప్పాడు.

# హార్దిక్ పాండ్యాపై నిషేధం

### ఐపీఎల్ 2025లో తొలి మ్యాచ్ నుంచి ఔట్

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17లో ముంబై ఇండియన్స్ తమ చివరి మ్యాచ్‌లో కూడా ఓడిపోవడం ద్వారా ప్రచారాన్ని ముగించింది. ఈ ఓటమి తర్వాత ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఒక మ్యాచ్ నిషేధానికి గురయ్యాడు. లక్నో సూపర్‌జెయింట్‌తో జరిగిన చివరి మ్యాచ్‌లో, ముంబై ఇండియన్స్ నిర్ణీత సమయంలో 20 ఓవర్లు పూర్తి చేయలేదు. తద్వారా హార్దిక్ పాండ్యా రూ.30 లక్షలు అందుకున్నాడు. జరిమానాతో ఒక మ్యాచ్ నిషేధం విధించారు. అయితే, ప్రస్తుతం ముంబై ఇండియన్స్ జట్టు మ్యాచ్‌లు ముగియడంతో వచ్చే సీజన్‌లో ఈ నిషేధం అమల్లోకి రానుంది. దీని ప్రకారం, హార్దిక్ పాండ్యా %క్రూూ% 2025లో ముంబై ఇండియన్స్ తరపున ఆడితే, అతను మొదటి మ్యాచ్ నుంచి నిషేధం విధించారు. ఎందుకంటే ఐపీఎల్ నిబంధనల ప్రకారం ఒక్కో జట్టు 20 ఓవర్లను 1 గంట 30 నిమిషాల్లో పూర్తి చేయాలి. ఎక్కువ సమయం తీసుకుంటే, ఒక ఫీల్డర్ బౌండరీ లైన్ నుంచి తప్పుకోనున్నాడు. అలాగే, ఈ తప్పు చేసిన జట్టు కెప్టెన్‌కు 12 లక్షల రూపాయలు జరిమానా విధించారు. అదే తప్పు 2వ సారి పునరావృతమైతే రూ.24 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, జరిమానా విధిస్తారు. అదనంగా, ప్లేయింగ్ ఎలెవన్‌లోని 10 మంది ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25% జరిమానా విధించబడుతుంది. మూడోసారి ఇదే తప్పు పునరావృతమైతే జట్టు కెప్టెన్‌కు 30 లక్షల రూపాయాల జరిమానాతోపాటు, దీంతోపాటు మూడు ఫౌల్‌లకు పాల్పడిన కెప్టెన్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధిస్తారు. అదేవిధంగా ప్లేయింగ్ ఎలెవన్‌లో 10 మంది ఆటగాళ్లకు ఒక్కొక్కరికి రూ.12 లక్షలు అందజేయనున్నారు. లేదా మ్యాచ్ ఫీజులో 50% జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

# ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ చేసిన పనికి ఫ్యాన్స్ ఫిదా..

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:




ఐపీఎల్ 2024 సీజన్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ అదరగొడుతోంది. గతంలో ఎన్నడూలేనంతగా భారీ స్కోర్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతోంది. బౌలింగ్ లోనూ రాణిస్తూ వరుసగా విజయాలు సాధిస్తోంది. గత మూడేళ్లుగా ప్లే ఆఫ్స్ కు చేరుకోలేక, పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం కోసం పోటీ పడిన ఎస్ ఆర్ హెచ్ ఈ సీజన్ లో టైటిల్ ఫేవరేట్ గా నిలిచింది. లీగ్ దశలో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఆ జట్టు ప్లే ఆఫ్ కు చేరుకుంది. ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిస్తే సన్ రైజర్స్ పాయింట్ల పట్టికలో ఏకంగా టాప్ - 2 కు చేరుకుంటోంది. దీంతో ఎస్ ఆర్ హెచ్ అభిమానులు తెగ ఖుషీ అవుతున్నారు. ఇదే జోరు కొనసాగించి ఐపీఎల్ ఛాంపియన్ గా నిలవాలని ఆకాంక్షిస్తున్నారు. కాగా ఎస్ఆర్‌హెచ్ ఈ రేంజ్‌లో దూకుడుగా ఆడడానికి కారణం కెప్టెన్ కమిన్స్ కూడా ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆసీస్ ను విశ్వవిజేతగా నిలిపిన కమిన్స్ ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్ ను కూడా ఐపీఎల్ ఛాంపియన్ గా నిలబెట్టడంలో తన వంతు కృషి చేస్తున్నాడు. దీంతో అభిమానులు, నెటిజన్లు కమిన్స్ పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. అయితే తాజాగా మరో మంచి పని చేసి అభిమానుల హృదయాలు గెల్చుకున్నాడీ ఆసీస్ కెప్టెన్. వివరాల్లోకి ఎస్ఆర్‌హెచ్ తర్వాతి మ్యాచ్ పంజాబ్ కింగ్స్ తో ఆడనుంది. ఆదివారం (మే19) ఉప్పల్ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. కాగా ఈ మ్యాచ్ కు ముందు కాస్త విశ్రాంతి తీసుకున్నాడు కెప్టెన్ కమిన్స్. ఇందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్ నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లాడు. అక్కడి పాఠశాల మైదానంలో విద్యార్థులతో సరదాగా క్రికెట్ ఆడాడు. కొంతమంది పిల్లలు కమిన్స్ కు బౌలింగ్ చేశారు. ఆ తర్వాత ఎస్ ఆర్ హెచ్ కెప్టెన్ ? వికెట్ కీపింగ్ చేస్తూ ఆకట్టుకున్నాడు. ఆసీస్ కెప్టెన్ తమతో కలిసిపోయి క్రికెట్ ఆడడంపై పిల్లలు బాగా ఎంజాయ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇది చూసిన అభిమానులు ఫిదా అవుతున్నారు. 'ఛాంపియన్ ప్లేయర్ తో క్రికెట్ ఆడడం ఆ పిల్లలకు ఎప్పటికీ గుర్తుండి పోతుంది.' 'నువ్వు గ్రేట్ కమిన్స్ మావా', ' విద్యార్థుల ముఖాల్లో నవ్వులు నింపినందుకు సంతోషంగా ఉందంటూ కమిన్స్‌కు ధన్యవాదాలు చెబుతున్నారు ఫ్యాన్స్.

# నా స్థాయికి ఇది సరిపోదు: రోహిత్

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:




ఐపీఎల్-2024 సీజన్‌ను విజయంతో ముగించాలనుకున్న ముంబై ఇండియన్స్‌కు నిరాశే మిగిలింది. ఆఖరి మ్యాచ్‌లోనూ ఓటమిపాలైంది. వాంఖడే వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. మొత్తంగా కేవలం నాలుగు మ్యాచ్‌లే గెలిచి పాయింట్ల పట్టికలో పదో స్థానంతో ఈ సీజన్‌ను ముగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 214 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (75బీ 29 బంతుల్లో, 5%ఇ4, 8ఇ%6), కేఎల్ రాహుల్ (55బీ 41 బంతుల్లో, 3%ఇ4, 3ఇ%6) అర్ధశతకాలతో రాణించారు. ఆయుష్ బదోని (22లి, 10 బంతుల్లో, 1%ఇ4, 2ఇ%6) దూకుడుగా ఆడాడు. నువాన్ తుషారా (3/28), పీయూష్ చావ్లా (3/29) చెరో మూడు వికెట్లతో సత్తాచాటారు. అనంతరం ఛేదనలో ముంబై 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రోహిత్ శర్మ (68బీ 38 బంతుల్లో, 10%ఇ4, 3ఇ%6) టాప్ స్కోరర్. నమన్ ధీర్ (62లిబీ 28 బంతుల్లో, 4%ఇ4, 5ఇ%6) పోరాడాడు. రవి బిష్ణోయ్ (2/37), నవీనుల్ (2/50) తలో రెండు వికెట్లు తీశారు. రోహిత్ క్రీజులో ఉన్నంత వరకు ముంబై ఫేవరేట్‌గా నిలిచింది. కానీ హిట్ మ్యాన్ ఔటైన అనంతరం మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. ఆఖర్లో నమన్ పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించింది. అయితే మ్యాచ్ అనంతరం రోహిత్ శర్మ 'జియో సినిమా'తో మాట్లాడాడు. ఈ సీజన్‌లో తన స్థాయికి తగిన ప్రదర్శన చేయలేదని అన్నాడు. అతిగా ఆలోచించకుండా, తన ఆటపైనే దృష్టి పెడుతున్నానని పేర్కొన్నాడు. ఈ సీజన్‌లో 14 మ్యాచ్‌లు ఆడిన 32 సగటు, 150 స్ట్రైక్ రేటుతో 417 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీ ఉంది.

"ఓ బ్యాటర్‌గా స్థాయికి తగ్గట్లుగా నేను ఆడట్లేదని తెలుసు. కానీ ఇన్నేళ్లు ఆడిన అనుభవంతో నేను దీని గురించి అతిగా ఆలోచించకూడదు. ఒకవేళ ఓవర్ థింక్ చేస్తే, నేను బాగా ఆడలేను. మంచి మైండ్ సెట్‌తో, సరైన జోన్‌లో ఉంటూ, ప్రాక్టీస్ చేస్తూ, నా ఆటలోని లోపాలను మెరుగుపర్చుకోవడం కోసమే ప్రయత్నిస్తాను" అని రోహిత్ అన్నాడు. మరికొన్ని రోజుల్లో టీ20 వరల్డ్ కప్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ మెగాటోర్నీలో హిట్ మ్యాన్ ఫామ్‌లో ఉంటే టీమిండియాకు తిరుగుండదు.

# టాప్-2పై సన్‌రైజర్స్ హైదరాబాద్ గురి..

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ లీగ్ దశలో చివరి పోరుకు సిద్ధమైంది. ఉప్పల్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో ఆదివారం తలపడనుంది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో టాప్-2లో చోటు సంపాదించాలని ఎస్ఆర్‌హెచ్ కసిగా బరిలోకి దిగుతోంది. మరోవైపు కీలక ఆటగాళ్లు దూరమై బలహీనంగా ఉన్న పంజాబ్ కింగ్స్ గెలుపుతో సీజన్‌ను ముగించాలని భావిస్తోంది. 15 పాయింట్లు సాధించి ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న హైదరాబాద్ టాప్-2లో నిలవాలంటే పంజాబ్‌పై నెగ్గడంతో పాటు ఇతర జట్ల ఫలితాలపై కూడా ఆధారపడాల్సి ఉంది. క్వాలిఫయిర్-1కు ఎస్ఆర్‌హెచ్ అర్హత సాధించాలంటే రేపు జరగనున్న మరో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ తప్పక విజయం సాధించాలి. కేకేఆర్ (19), రాజస్థాన్ (16) కూడా ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరిన విషయం తెలిసిందే. టాప్-2లో నిలిచిన జట్లు క్వాలిఫయిర్-1కు చేరుకుంటాయి. అందులో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుతుంది. ఓడిన జట్టు క్వాలిఫయిర్-2లో ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజేతతో పోటీపడుతుంది. మూడు, నాలుగు స్థానాల్లో ఉన్న జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడతాయి. ఇక క్వాలిఫయిర్-1, క్వాలిఫయిర్-2లో గెలిచిన జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధిస్తాయి. అందుకే టాప్-2లో స్థానం కోసం ఎస్ఆర్‌హెచ్ గురిపెట్టింది. అయితే రేపటి మ్యాచ్‌లో స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్‌కు విశ్రాంతి ఇవ్వాలని సన్‌రైజర్స్ టీమ్ మేనేజ్మెంట్ భావిస్తోంది. ఈ సీజన్‌లో అన్ని మ్యాచ్‌లు ఆడిన భువనేశ్వర్‌కు రేపటి నామమాత్రపు మ్యాచ్‌లో విశ్రాంతి ఇస్తే, తర్వాత జరగనున్న కీలక మ్యాచ్‌ల్లో ప్రభావం చూపుతాడని భావిస్తోంది. అలాగే మయాంక్ అగర్వాల్, ఉమ్రాన్ మాలిక్, వాషింగ్టన్ సుందర్‌కు జట్టులో స్థానం ఇవ్వాలని యాజమాన్యం భావిస్తోంది. భువీ స్థానంలో ఉమ్రాన్, సన్వీర్ సింగ్ స్థానంలో మయాంక్, షాబాజ్ అహ్మద్‌కు బదులుగా సుందర్‌ను తీసుకోవాలని యోచిస్తోంది.సన్‌రైజర్స్ హైదరాబాద్ తుదిజట్టు (అంచనా)ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, మయాంక్ అగర్వాల్, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి, అబ్దుల్ సమద్, వాషింగ్టన్ సుందర్, ప్యాట్ కమిన్స్ (కెప్టెన్), ఉమ్రాన్ మాలిక్, విజయ్‌కాంత్, నటరాజన్‌ఇంపాక్ట్ ప్లేయర్: జయదేవ్ ఉనద్కత్.



# శరవేగంగా పుష్ప-2 షూటింగ్

- రామోజీ ఫిల్మ్ సిటీలో మలేషియా సెట్టింగ్
- ఐటమ్ సాంగ్ కోసం జాన్వీని ఒప్పించే ప్రయత్నం

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

అనుకున్న తేదీ ఆగస్ట్ 15న ఎలాగైనా విడుదల చేయాలని 'పుష్ప 2' టీమ్ షూటింగ్ పూర్తి చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. అందుకు తగ్గట్టే రాత్రింబవళ్లు పని చేస్తున్నారు. అయితే ఐటమ్ సాంగ్ కోసం ఇంతవరకూ ఎవరినీ ఖరారు చేయలేదని తెలుస్తోంది. చివరకు జాన్వీ కపూర్‌ను ఒప్పించేలా డైరెక్టర్ సుకుమార్ ఉన్నట్లు టాక్. ఈ సినిమా కోసం మలేషియాలో కీలకమైన సన్నివేశాల్ని తెరకెక్కించాలనుకొన్నారు. అయితే ఇప్పుడు అంత టైమ్ లేదు. అందుకే హైదరాబాద్ లోని రామోజీ ఫిల్మ్ సిటీనే మలేషియాగా మారుస్తున్నారు. అక్కడ ఈ సినిమా కోసం ఓ భారీ సెట్ తీర్చిదిద్దారు. అక్కడే మలేషియాలో తెరకెక్కించాల్సిన సీన్స్ షూట్ చేస్తున్నారు. 'పుష్ప 2' షూటింగ్ ఎంత వేగంగా జరుగుతున్నా టీమ్‌ని రెండు విషయాలు ఇబ్బంది పెడుతున్నాయని తెలుస్తోంది. ఒకటి.. ఫహద్ ఫాజిల్ ఈ సినిమాకు డేట్లు కేటాయించడం లేదు. ఈ సినిమాలో ఫహద్ కీలక ప్రాత పోషిస్తున్న సంగతి తెలిసిందే. తనపై ఇప్పటికే కొంతమేర షూటింగ్ చేశారు. అయితే మరో 15 రోజుల కాల్షీట్లు అవసరం అయ్యాయి. కానీ ఫహద్‌కు ఉన్న బిజీ కారణంగా డేట్లు కేటాయించడం లేదు. మరోవైపు ఐటెమ్ సాంగ్ చేసే హీరోయిన్ సమస్య కూడా వెంటాడుతోంది. ఐటెమ్ గాళ్‌గా ఎవరిని తీసుకోవాలన్న విషయంలో ఇంకా ఓ క్లారిటీకి రాలేదని తెలుస్తోంది. చాలామంది అగ్ర కథానాయికల పేర్లు పరిశీలించారు. కానీ ఏదీ ఇంకా ఫైనల్ కాలేదు. ఎవరూ దొరకని పక్షంలో ఈ పాటని జాన్వీకపూర్‌తో చేయాలని భావిస్తున్నారట. ఈ విషయంలో ఈ వారంలో ఓ స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఇటీవల ' 2' నుంచి టైటిల్ సాంగ్ విడుదలైంది. మరో పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.




# సూర్యకు జోడీగా బుట్టబొమ్మ

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

సూర్య కథానాయకుడిగా కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా జూన్ తొలి వారం నుంచి అండమాన్ దీవుల్లో చిత్రీకరణ ప్రారంభించుకోనుంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన ప్రధాన తారాగణాన్ని ఖరారు చేసే పనిలో పడింది చిత్ర బృందం. ఇందులో భాగంగా సూర్యకు జోడీగా పూజా హెగ్డేను ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయంపై ఆమెతో సంప్రదింపులు పూర్తయినట్లు తెలిసింది. ప్రేమ, వినోదం, యాక్షన్ అంశాలతో నిండిన ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం రూపొందనుంది. తొలి షెడ్యూల్ దాదాపు 40రోజులకు పైగా సాగనున్నట్లు తెలుస్తోంది. దీంట్లో మలయాళ నటుడు జోజు జార్జ్ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. సంతోష్ నారాయణన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.



# హాలీవుడ్ మ్యాగజైన్‌లో దీపికా పడుకొణె



హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

డెడ్‌లైన్స్ గ్లోబల్ డిస్‌రప్టర్స్ అనే హాలీవుడ్ మ్యాగజైన్ ప్రతీ ఏడాది.. ప్రపంచవ్యాప్తంగా వినోదరంగంలో రాణిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ నటీనటుల జాబితాను విడుదల చేస్తుంది. ఇటీవలే విడుదల చేసిన ఈ ఏడాది జాబితాలో ప్రముఖ బాలీవుడ్ అగ్రతార దీపికా పదుకొణె చోటు దక్కించుకుంది. ఈ గౌరవాన్ని అందుకున్న ఏకైక భారతీయ నటిగా దీపిక నిలిచింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దీపిక తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ..కొన్ని ఆసక్తికర విషయాల్ని తన అభిమానులతో పంచుకుంది. 'నటించిన సినిమా విజయం అందుకోవాలి, బాక్సాఫీసు వద్ద కాసుల వర్షం కురవాలి, పాత్ర మెప్పించాలి, సినీ ప్రియులు కథనంతో పాటు సాగిపోయేలా కథలను ఎంపిక చేసుకోవాలి, అవార్డులు ప్రశంసలు దక్కాలి, మంచి స్థాయిలో ఉండాలి..ఇలా ఇవే ముఖ్యమంటారు కొందరు నటీనటులు. నా దృష్టిలో ముఖ్యమైనవి ఏమైనా ఉన్నాయంటే అది ఒక మంచి వ్యక్తిగా ఎదగడం, మంచి వ్యక్తులతో సమయం గడపడం, సెట్‌లోని అనుభవాలను మర్చిపోలేని జ్ఞాపకాలుగా గుర్తుచేసుకోవడం. ఇవే నాకు ముఖ్యం. ఇప్పుడీ గౌరవానికి కూడా కారణం అదే అని నా అభిప్రాయం'. ప్రపంచం చాలా చిన్నదై పోయిందని నేను అనుకుంటున్నా. సినీ రంగంలోని పరిశ్రమలన్నీ ఒక్కచోట చేరి ఈ ప్రపంచానికి గొప్ప కథలు చెప్పేందుకు సిద్ధమవుతున్నాయి. మనం చెప్పే కథల వల్లే ఈ ప్రపంచంలో మార్పులు వస్తున్నాయని నేననుకోవట్లేదు. ప్రేక్షకులు మెచ్చేలా, ఆశ్చర్యపోయేలా, ఆసక్తికరమైన కథలు మాత్రమే మనం చెబుతున్నాం. అదే జరుగుతుంది కూడా'. 'ఓం శాంతి ఓం' సినిమా కోసం నేను అసలు ఆడిషన్ ఇవ్వలేదు. 2007లో విడుదలై మంచి విజయాన్ని అందుకున్న ఈ చిత్రంతోనే నేను బాలీవుడ్‌కి

పరిచయమయ్యా. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఏ ఆడిషన్ చేయకుండానే నన్ను ఎంపిక చేశారు.అలా మొదలైన నా ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నా'. 'బాలీవుడ్‌లోనే కాదు హాలీవుడ్‌లోనూ నన్ను ప్రేక్షకుల ఆదరిస్తున్నారు. పదేళ్ల క్రితం నేను హాలీవుడ్ సినిమాలకు ఆడిషన్ ఇచ్చా. అక్కడంతా కొత్త విధానం. అక్కడి సినిమాలోని నటనకు తగ్గట్టు నేను ఫాన్సీ యాక్టింగ్ స్కూల్లో చేరలేదు, ఇంగ్లిష్ నటనలో శిక్షణ తీసుకోలేదు. కానీ ఒక్కసారి హాలీవుడ్‌లో అడుగుపెట్టిన తర్వాత ఇంగ్లిష్ సినిమాలకి తగ్గ నైపుణ్యాలను నేర్చుకున్నట్లు చెప్పారు.

# హీరామండి మరువలేని అనుభవం

## మనీషా కోయిరాలతో నటించడం అదృష్టం: సోనాక్షి

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

ప్రస్తుతం 'హీరామండి'కు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన ఈ సిరీస్ ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోనాక్షి సిన్హా తన సహనటి మనీషా కొయిరాలకు క్షమాపణలు చెప్పినట్లు వెల్లడించారు. 'నాకు మనీషా అంటే ఎంతో ఇష్టం. 'హీరామండి: ది డైమండ్ బజార్' వెబ్‌సిరీస్ మొత్తం చూసిన తర్వాత ఆమెకు క్షమాపణలు చెప్పాను. కొన్ని సన్నివేశాల్లో భాగంగా ఆమెతో దురుసుగా ప్రవర్తించాను. సిరీస్ చూశాక నేను వాటిని ఎలా చేయగలిగాను అనిపించింది. అందుకే సారీ చెప్పాను. ఆమె గొప్ప నటి. తన సహనటులను ఎంతో ప్రోత్సహిస్తారు. షూటింగ్ మొత్తం సరదాగా గడిపాం. అంత గొప్ప నటితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం.

మళ్లీ ఆమెతో నటించే రోజు కోసం ఎదురుచూస్తున్నా' అన్నారు. ఇక సంజయ్ లీలా భన్సాలీ గురించి మాట్లాడుతూ.. 'ఆయన దర్శకత్వంలో నటిస్తే కష్టపడాల్సిన అవసరం లేదు. సీన్‌కు ముందే అన్ని విషయాలు చర్చిస్తారు. భన్సాలీ నన్ను మెచ్చుకోవడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇంత గొప్ప పాత్రను ఇచ్చినందుకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటాను' అని చెప్పారు. 'హీరామండి'లో సోనాక్షీ ద్విపాత్రాభినయం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో ఆమె నెగెటివ్ ఛాయలున్న పాత్రల్లో కనిపించారు. వేశ్యల జీవితాల ఆధారంగా ప్రముఖ దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ రూపొందించిన ఈ సిరీస్‌లో మనీషా కొయిరాలా, అదితిరావు హైదరి, రిచా చద్దా, షర్మిన్ సెగల్, సంజీదా షేక్ ఇతర కీలకపాత్రలు పోషించారు. దీనిపై బాలీవుడ్‌స్టార్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.




# సంగ్రామ్ భలేరావ్‌గా రణ్‌వీర్ సింగ్



హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

సంగ్రామ్ భలేరావ్‌గా 'సింగమ్ అగైన్'తో అలరించేందుకు సిద్ధమవుతున్నాడు బాలీవుడ్ కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. రోహిత్ శెట్టి దర్శకత్వంలో రానున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. రణ్‌వీర్ తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. ఈ షూటింగ్ పూర్తయ్యాక అదిత్య ధర్‌తో ఓ సినిమాని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. దానికి 'ధురంధర్' అనే టైటిల్‌ని ఖరారు చేసినట్టు తెలిసింది. 'ఈ కలయికలో రానున్న తొలి చిత్రం కాబట్టి చిత్రబృందం ఈ సినిమాని ఎంతో ప్రత్యేకంగా తెరకెక్కించనుంది. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌ని రాజకీయాలు, గ్యాంగ్‌వార్ నేపథ్యంలో రూపొందించనున్నారు. జూన్‌లో దీని చిత్రీకరణను మొదలుపెట్టనున్నారు' అని సన్నిహితవర్గాలు తెలిపాయి.

# జక్కన్న మూవీ కోసం మళయాల నటుడు పృథ్వీరాజ్

### ఎక్స్‌లో వైరల్‌గా మారిన వార్త

హైదరాబాద్,మే18(అక్షరం న్యూస్:

మహేశ్‌బాబు హీరోగా దర్శకధీరుడు రాజమౌళి ఓ భారీ ప్రాజెక్ట్ రూపొందించనున్న విషయం తెలిసిందే. ఎంబి 29గా ఇది ప్రచారంలో ఉంది. దీనిపై వార్తలు సోషల్ మీడియాలో చక్కెర్లు కొట్టాయి. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ఎక్స్‌లో షేర్ అవుతోంది. దీంతో ఈ హ్యాష్ ట్యాగ్ మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రంలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలకపాత్రలో కనిపించనున్నారట. ఈ విషయమై పృథ్వీరాజ్‌ను రాజమౌళి సంప్రదించారని.. ఆయన కూడా ఓకే చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఆయన ఇందులో విలన్‌గా కనిపించనున్నారట. దీనిపై అధికారిక ప్రకటన కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఒకవేళ ఇదే నిజమైతే మహేశ్-పృథ్వీలను ఒకే స్క్రీన్‌పై చూడొచ్చని అభిమానులు ఆశపడుతున్నారు. మలయాళంలో స్టార్‌గా ఎదిగిన పృథ్వీరాజ్ ఇటీవల 'సలార్'తో ప్రేక్షకులకు ఆకట్టుకున్నారు. ఇప్పుడీ చిత్రంతోనూ ఇక్కడ అభిమానులను సొంతం చేసుకోవచ్చని భావించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఆయన్ని తీసుకోవడం వల్ల

మలయాళంలోనూ సినిమాను ప్రమోట్ చేసుకోవచ్చని చిత్రబృందం ఆలోచించినట్లు టాక్. తాజాగా ఈ సినిమా కాస్టింగ్ డైరెక్టర్ విషయంలో రూమర్స్ రాగా టీమ్ వాటిని ఖండించింది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఏ అప్‌డేట్ అయినా నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటిస్తుందని క్లారిటీ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ గురించి రాజమౌళి ఇటీవల ఓ సందర్భంలో మాట్లాడుతూ.. నటీనటుల ఎంపిక పక్రియ జరుగుతున్నట్లు చెప్పారు. త్వరలోనే సినిమా టైటిల్‌ను ప్రకటిస్తామన్నారు. ఈ సినిమాను 'మహారాజ్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో మహేశ్‌కు సంబంధించిన ఎనిమిది లుక్స్‌ను జక్కన్న టీమ్ రెడీ చేసినట్లు టాక్.



## తీన్మార్ మల్లన్నను గెలిపించండి...



**మహబూబాబాద్ /గార్ల /మే 18/అక్షరం న్యూస్:** వరంగల్ -నల్గొండ -ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపునిచ్చారు. తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, పట్టభద్రుల హక్కుల కొరకు, నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలో గొంతెత్తి మాట్లాడే మల్లన్నను గెలిపించాలని అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కొరకు అనునిత్యం పోరాడుతున్న మల్లన్నను నిరుద్యోగుల ప్రతినిధిగా శాసన మండలికి పంపించాలని అన్నారు. భవిష్యత్ తరాల కోసం, కనివిని ఎరుగని రీతిలో అఖండ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మల్లన్నకు పట్టం కట్టాలన్నారు. తీన్మార్ మల్లన్న గెలుపుతోనే పట్టభద్రుల సమస్యలు చట్ట సభలో చర్చకు వస్తాయని, తద్వారా పరిష్కార మార్గం లభిస్తుందని అన్నారు. సమావేశంలో బయ్యారం పి ఏ సి ఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, కంబాల ముసలయ్య, ప్రవీణ్ నాయక్, మోహన్ జి, నాయిని శ్రీనివాస్ రెడ్డి, వేల్పుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ నమోదు కేంద్రాలు లేక అవస్థలు

**- గార్లలో అదనపు ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి**
**- సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్**




**మహబూబాబాద్ /గార్ల /మే 18/అక్షరం న్యూస్:** గార్ల మండల కేంద్రంలో అదనపు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అదనపు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనీ నిరసన తెలియజేశారు. అనంతరం కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆధార్ కార్డు సర్వరోగ నివారిణిగా మారిందని, బ్యాంకు ఖాతా నుండి మొదలు పెన్షన్ డబ్బులు, రేషన్ సరుకులు తీసుకునే దాక ఆధార్ కార్డు తప్పనిసరి అయిందని అన్నారు. అదనపు ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని అన్నారు. కొత్తగా ఆధార్ దరఖాస్తులు, మార్పులు, చేర్పులు కొరకు ఇతర మండలాలకు వెళ్లలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అనేక సార్లు మండల, జిల్లా అధికారులకు విన్నవించినప్పటికి ఫలితం లేకుండా పోయిందని అన్నారు. తక్షణమే గార్ల మండల కేంద్రంలో అదనపు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలనీ డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవీందర్ కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూక్యా హరి నాయక్, వి. పి వెంకటేశ్వర్లు, ఎ. వీరాస్వామి, బి. లోకేశ్వరావు, జి. వీరభద్రం, వీరన్న, ప్రవీణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో ఎటిఎం ద్వారా పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు




**మహబూబాబాద్ /గార్ల /మే 18/అక్షరం న్యూస్:** దేశం లోనే మొదటిసారిగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ లలో ఇదివరకు ఎన్నడూలేని విధంగా మైక్రోఎటిఎం ద్వారా వరంగల్ రీజియన్,బయ్యారం బ్రాంచ్,గౌరారం గ్రామంలో బ్యాంక్ మిత్ర గంగుల బయమ్మ ఆధ్వర్యంలో పాస్ బుక్ ప్రింటింగ్ ను బయ్యారం బ్రాంచ్ మేనేజర్ ఎన్. మనోహర్ ప్రారంభించారు.కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎన్.మనోహర్ మాట్లాడుతూ, మైక్రో ఏటీఎం ద్వారా పాస్ బుక్ ప్రింటింగ్ సేవలు వచ్చే విధంగా టెక్నాలజీ అభివృద్ధి చేసిన ఐఆర్ఐఎక్స్ టెక్నాలజీ సంస్థ ను ప్రత్యేకంగా అభినదించారు.. గ్రామం నందు ప్రతీ ఖాతా దారుడు ఉచితంగా పాస్ బుక్ సేవలు పొందవచ్చు అన్నారు.. ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం కూడ ఉండదని గ్రామ ప్రజలకు పాస్ బుక్ ముద్రణ యొక్క ప్రాముఖ్యత ను గురించి వివరించారు. అన్నీ బ్యాంక్ మిత్ర పాయింట్లలో కూడ ప్రింటర్ సదుపాయాన్ని కల్పించాలని కోరారు.కార్యక్రమంలో బ్యాంకు మిత్రాలు బయ్య మహేష్,రేక అమని, ఐఆర్ఐఎక్స్ సంస్థ నుండి రీజినల్ ఇంచార్జ్ శోభన్, ఛానల్ మేనేజర్ జి.రంజిత్,గ్రామ ప్రజలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి అదనపు కలెక్టర్ జి వి శ్యామ్ ప్రసాద్ లాల్ పెద్దపల్లి టౌన్ మే 18 అక్షరం న్యూస్ జిల్లాలో యాసంగి పెండిగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు శనివారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు శ్రీకాంత్ రెడ్డి మార్కెట్ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనాలి

**- జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ**



**రాజన్న సిరిసిల్ల /వేములవాడ, మే - 18 (అక్షరం న్యూస్):** రైతులు వరి కోతలు మొదలుపెట్టి నెలరోజులపై అవుతుంది ఇప్పటి వరకు వడ్లు కళ్ళాలల్లో అకాల వర్షాలతో తడిసి మొలకెత్తుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోళ్ల విషయంలో మొద్దు నిద్ర వహిస్తుంది . రైతుల పక్షాన నిరంతరం పోరాడే బిజెపి పార్టీ శ్రేణులు బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో వడ్ల కళ్ళాలను సందర్శించి మీడియా ద్వారా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించడం జరిగింది వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనాలని , కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు 500 రూపాయల బోనస్ వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని వడ్ల కొనుగోలు జరిపే వరకు ప్రతీ రోజు బిజెపి నిరసన కార్యక్రమాలు ఉంటాయని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బిజెపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, రూరల్ ఎంపీపీ బండ మల్లేశం, సంటీ మహేష్, కోల కృష్ణ స్వామి, గోపు బాలరాజు,మైలారం శ్రీనివాస్, గుడిసె మనోజ్,మెరుగు లక్ష్మణ్, పిన్నింటి హనుమండ్లు,వాసం మల్లేశం యాదవ్,లక్ష్మిరాజం, బోనాల శివ, కుమ్మరి మారుతి, బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొనడం జరిగింది.





# ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి

**- అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**
**- నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై కొనుగోలు**
**- పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెకం**



**పెద్దపల్లి, ప్రతినిధి మే - 18 అక్షరం న్యూస్:** జిల్లాలో యాసంగి పెండింగ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న రైతులతో మాట్లాడి, ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాబావ పరిస్థితులు ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని, రైస్ మిల్లుల వద్ద ధాన్యం కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్ అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనుల్లో జాడలేని సౌకర్యాలు

**- సిపిఐ మండల సహాయ కార్యదర్శి భాస్కర్**



**మహబూబాబాద్/కేసముద్రం/మే18/అక్షరం న్యూస్:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో కనీస సౌకర్యాల జాడేలేదని సిపిఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు.శనివారం మండల కేంద్రంలోని అమీనాపురం గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా మంద భాస్కర్ మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని నిర్మూలించేందుకు,వలసల నివారణకై 2005 నాటి యుపిఏ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు.ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి వంద రోజుల పని కల్పించబడుతుందన్నారు.దీంతోపాటు ఉపాధి హామీ కూలీలకు దాహం వేసినప్పుడు త్రాగేందుకు నీళ్ల సౌకర్యం,ఉపాధి హామీ కూలి పని చేసిన క్రమంలో అలసిపోయినప్పుడు సేద తీరేందుకు నీడ కోసం టెంటు ఏర్పాటు చేయాలని,అనుకోని పరిస్థితులలో ఉపాధి కూలికి ఏదైనా ప్రమాదం సంభవించినట్లయితే ప్రథమ చికిత్స నిమిత్తం ఫస్ట్ ఎయిడ్ బాక్సులను అందుబాటులో ఉంచాలని చట్టంలో పేర్కొన్నప్పటికీ,అధికారులు సౌకర్యాలు కల్పించకుండా ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడం వలన ఉపాధి హామీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎండ తీవ్రత విపరీతంగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు.ఉపాధి కూలీలు పని చేసి నెలలు గడిచిన సకాలంలో బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.చేసిన పనికి బిల్లు చెల్లించుటలో జాప్యం చేయడం ఎందుకని అధికారులను ప్రశ్నించారు.ఉపాధి హామీ కూలీలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు 600 రూపాయల కూలి చెల్లించాలని,ప్రభుత్వమే పనిముట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.సంబంధిత ఉపాధి హామీ అధికారులు తక్షణమే స్పందించి పని ప్రదేశంలో ఉపాధి హామీ చట్టప్రకారం కనీస సౌకర్యాలు కల్పించాలని లేని పక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి దాసరి లింగస్వామి, రంజిత్,వెంకటయ్య,సత్యం అశోక్,ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

**- జూన్ 8,9,10, తేదీలలోవేములవాడలోజరుగు కార్యక్రమాన్ని ఉపయోగించుకొని విజయవంతం చేయండి.**
**- సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్.**
**- వేములవాడ పట్టణంలో మూడు రోజులపాటు**
**- సిపిఎం కార్యకర్తల శిక్షణ తరగతులు.**



**రాజన్న సిరిసిల్ల/ వేములవాడ, మే - 18 (అక్షరం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణాతరగతులు జూన్ 8 9 10 తేదీలలో వేములవాడ పట్టణంలో జరుగుతాయని ఇట్టి శిక్షణ తరగతులకు జిల్లా నలుమూలల నుండి ఎంపికచేయబడిన100మంది ముఖ్య నాయకులు ఈ తరగతులలో తర్ఫీదుపొందుతారు.రాష్ట్ర పార్టీ నాయకులు శిక్షణా ఇస్తారు ఈ తరగతులను సిపిఎం పార్టీ నాయకులు, కార్మికులు, ప్రజాసంఘాల నాయకులు హాజరవుతారని తెలిపారు . ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ.... రాజన్న సిరిసిల్ల జిల్లాలో సిపిఎం పార్టీ కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు నిర్వహిస్తున్నది. మన జిల్లాలో వీర్నపల్లి గర్జనపల్లి మరిమడ్ల. చందుర్తి గ్రామాల్లో రైతులు సాగు చేసుకున్న పోడు భూములకు హక్కు పత్రాలు పోరాటాలు నిర్వహించింది. రామోజీపేట ఇల్లంతకుంట అల్మాస్పూర్ గ్రామాల్లోని దళితులపై అగ్రవర్ణాల చేసిన దాడులకు వ్యతిరేకంగా అందర్నీ ఐక్యం చేసి కేసులకు సైతం భయపడకుండా ఉద్యమాన్ని నిర్వహించింది . సిరిసిల్ల,ఇల్లంతకుంట లో ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ కోసం పోరాటం చేసిన ఫలితంగా వందలాది మందికి ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ అందించింది పవర్ లూమ్ గ్రామపంచాయతీ మున్సిపల్, ఆశ అంగన్వాడి, హమాలి కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నది.జిల్లాలో పేదల సమస్యల పరిష్కారం కానీ సమస్యలు చాలా ఉన్నవి. రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు కార్యకర్తలకు తర్ఫీదునిస్తున్నాము. వేములవాడ పట్టణంలో మూడు రోజులపాటు సిపిఎం కార్యకర్తల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని కావునా సీపీఎం పార్టీ నాయకులు అందరూ పాల్గొని రాజకీయ శిక్షణ తరగతులను ఉపయోగించుకొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు ,ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, మల్లారపు ప్రశాంత్ ,గురిజాల శ్రీధర్ నాయకులు గణేష్, అశోక్, వేణు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించాలి

**- కార్మిక సమస్యల పరిష్కారమే ఏఐటీయూసీ లక్ష్యం**
**- సింగరేణి పాఠశాలలో సీబీఎస్ సిలబస్ ను ప్రవేశపెట్టాలి ప్రధాన కార్యదర్శి : రాజ్ కుమార్**



**భద్రాద్రి జిల్లా/ కొత్తగూడెం/ మే.18/ అక్షరం న్యూస్ :** సింగరేణి ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ అన్నారు. శనివారం నాడు కొత్తగూడెంలోని ఏఐటియుసి కేంద్ర కార్యాలయం నందు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడిచిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయం సాధించిందన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నందు గుర్తింపు యూనియన్ గా ఏఐటీయూసీ కార్మికుల పక్షాన నిలబడిందన్నారు. అధికారికంగా గుర్తింపు ధ్రువపత్రం ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సింగరేణి యాజమాన్యం అందజేస్తుందన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున కార్మికుల ఉద్యోగ పదోన్నతి, బదిలీలు ఆగిపోయాయి అన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో సింగరేణి అధికారులు ఉద్యోగులు సెక్యూరిటీ సిబ్బంది ఎంతో బాధ్యతగా ఎన్నికల విధులను నిర్వర్తించారు. వారికి ఎన్నికల సమయంలో రావలసిన అలవెన్సు అందించలేక పోయారన్నారు. సింగరేణి లోని ప్రతి ఏరియాలో ఉన్న ఆసుపత్రుల నందు సరైన అంబులెన్సును నడపాలన్నారు. స్కాలర్షిప్ మెరిట్ ను 57 మెటీరియల్ స్లాట్స్ గా అనుమతించి అందరికీ అందించాలన్నారు. కార్మికుల పిల్లలు ప్రైవేటు పాఠశాలల నందు చదువుతూ అధిక ఫీజుల భారం కార్మికులపై పడుతుందని చెప్పారు. సంస్థ ద్వారా నడుస్తున్న పాఠశాలల నందు సిబిఎస్ సిలబస్సు ప్రవేశపెట్టి కార్మికుల పిల్లలు విద్యలో అగ్రగామిగా నిలబడుటకు యాజమాన్యం కృషి చేయాలన్నారు. వేసవి కాలం కావడం వల్ల బహిర్గత గనులలో పనిచేస్తున్న కార్మికులకు మంచినీరు శీతల పానీయాలు అందించాలని యాజమాన్యాన్ని కోరారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల పక్షాన నిలబడి వారి సమస్యలను అనునిత్యం వెంటాడి పరిష్కరించే యూనియన్ ఏఐటీయూసీ నే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, మల్లికార్జున్, రమణ మూర్తి, కిష్టఫర్, మాతంగి లింగయ్య, రాములు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జారిపోతున్న రోడ్డు...







**- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు...**
**- మిట్టపల్లి, రంగం బంజరు వరకు రోడ్డు పరిస్థితి ప్రమాదకరం..**

**ఖమ్మం/తల్లాడ మే 18 (అక్షరంన్యూస్):** తల్లాడ మండలం మిట్టపల్లి నుండి రంగం బంజరు వరకు రోడ్డు కరిగిపోయి పిడతలుగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది..ఇలా రోడ్డు జారీ పిడతలగా ఏర్పడడం వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శనివారం రంగం బంజరు వద్ద రోడ్డు పై ఏర్పడ్డ జారుడు పెచ్చులు వల్ల ఓ విద్యార్థికి గాయాలైనవి అక్కడున్న స్థానికులు అటు వైపు వస్తున్న వాహనంపై ఆ చిన్నారిని తరలించారు. ఇలా రోజుకో ప్రమాదం ఈ రోడ్డుపై జరుగుతుంది. ఆర్ అండ్ బి అధికారులు జోక్యం చేసుకొని రోడ్డుపై తారు జారి ఏర్పడుతున్న లాంటి రోడ్డుపై ఉన్న దిబ్బలను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కల్పించుకొని రోడ్లకు మరమ్మతులు చేయాలని ఆ గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

## శనీశ్వర స్వామికి ప్రత్యేకంగా తిల తైల అభిషేక పూజలు



**నాగర్ కర్నూల్ మే 18(అక్షరం న్యూస్):** బిజినెపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో వైశాఖమాసం శనివారం దశమి శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా తిల అభిషేకాలు పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధానఅర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ క్రోధి నామ సంవత్సరంలో శనీశ్వర స్వామి మంత్రిగా వ్యవహరిస్తున్నడని,ఈ వైశాఖ మాసంలో శనేశ్వర స్వామికి,పరమ శివునికి పూజలు చేయడం విశేషపుణ్య ఫలితం అన్నారు.భక్తుల జన్మ రిత్యా,గోచార రీత్యా అర్థాష్టమ శని,అష్టమశని, ఏలినాటి శనిగ్రహదోషాలు తొలగుటకు,శనిగ్రహ శాంతి కొరకు శనేశ్వర స్వామినీ నువ్వులనూనె,జిల్లేడుపూలు,జమ్మి ఆకులతో ఈరోజు పూజించారని అన్నారు.బ్రహ్మ సూత్రం గల పరమశివునికి ఈరోజు భక్తులచే రుద్రాభిషేక పూజలు,అర్చనలు ప్రత్యేకంగానిర్వహించినట్లు ఆయనతెలిపారు.గణపతి,నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలోఆలయ చైర్మన్ గోపాలరావు,గ్రామ ఆలయకమిటీ సభ్యులు, వీరశేకర్,ప్రభాకర్, పుల్లయ్య,ఆలయ ఆర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్, జయంత్, సాయిసృజన్ సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు,అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

## అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**- జిల్లా నాయకులు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ శివారపు శ్రీధర్**



**మహబూబాబాద్/కేసముద్రం/మే18/అక్షరం న్యూస్:** అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా నాయకులు శివారపు శ్రీధర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు కురిసిన భారీ వర్షానికి మొక్కజొన్న, వరి పంటలు నీట మునిగి రైతులకు నష్టాన్ని కలుగజేశాయని,వర్షం వల్ల తడిసిన ధాన్యానికి అధికంగా తేమ ఉండటం వల్ల ఐకెపి సెంటర్లలో పంటను కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టకుండా పూర్తిగా ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఆరుకాలం కష్టపడిన రైతుకు అకాల వర్షాల వల్ల తీవ్రమైన నష్టం కలుగుతుందని,పండించిన పంటను అరబెట్టుకోవడానికి గాని,ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి గిడ్డంగుల సౌకర్యం లేదని,తడిసిన ధాన్యాన్ని అరబెట్టుకోవడానికి తక్షణమే ప్రభుత్వం గిడ్డంగులను నిర్మించాలని డిమాండ్ చేశారు.అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రత్యేక బీమా సౌకర్యాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని,ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.అదే విధంగా రైతు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చేందుకు చట్టాన్ని తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. వ్యవసాయానికి సబ్సిడీ కింద విత్తనాలు,ఎరువులు సప్లై చేయడం వల్ల రైతుకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందని,దీనివల్ల వ్యవసాయం వృద్ధిచెందుతుందని,రైతులు అప్పుల బారిన పడకుండా ఉంటుందని తెలిపారు.స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ,వాటిని తక్షణమే అమలు చేసి రైతంగాన్ని ఆదుకోవాలని అన్నారు.తడిసిన ధాన్యాన్ని ఎటువంటి అభ్యంతరాలు పెట్టకుండా మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసి అదుకోవాలని అన్నారు.తేమ సాకు చూపెట్టి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తే రైతులందరిని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**- ఎమ్మెల్యే విజయ్‌కాల్వ శ్రీరాంపూర్,**



**పెద్దపల్లి మే 18 అక్షరం న్యూస్:** తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు మండలంలోని వెన్నంపల్లి, మంగపేట, కునారం గ్రామాలలో శనివారం రోజున ఉదయం వద్ద కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం రైతులెవరు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు గజనవేన సదయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సోన్నాయి టెంకం శివరామకృష్ణ, మాజీ ఎంపిటిసి బంగారి రమేష్, బీసీ సెల్ మండల అధ్యక్షులు సబ్బని రాజమల్లు,రానవేన శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దాడి, హత్యాయత్నం ఘటనపై కేసు నమోదు

**రాజన్న సిరిసిల్ల / ముస్తాబాద్/మే -18(అక్షరం న్యూస్ ):** ముస్తాబాద్ మండలం కొండాపూర్ జీపి ఆవరణలో తనపై జరిగిన దాడి, హత్యాయత్నముతో ప్రాణ భయంతో పోలీసులను ఆశ్రయించినట్లుగా బాధితుడు తుపాకుల శ్రీనివాస్ గౌడ్ శనివారం తెలిపారు.కొండాపూర్ జీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి వద్ద తన ఇంటికి సంబంధించిన పత్రము తీసుకోవడానికి వెళ్లగా, పాత విషయాలను దృష్టిలో పెట్టుకొని, ముందస్తు పథకం ప్రకారం ఆయన అనుచరులను దాడికి ఉసిగొల్పి, హత్యాయత్నం చేయించారని, తనపై కేసు నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని వాపోయాడు , గాయపడ్డ తానూ ఆసుపత్రిలో చికిత్స పొంది పోలీసులను ఆశ్రయించినట్లుగా వివరించారు. ఎఫ్ఆర్ నెంబర్ 150 ద్వారా ఐపీసీ సెక్షన్లు 294 (బి), 323, 506 కింద కేసు నమోదు చేసి ఎస్ఐ కే శేఖర్ రెడ్డి దర్యాప్తు చేపట్టారు.

## ఖమ్మం రూరల్ మండలం నుంచి ప్రజల చెంతకే మీ శీనన్నకు శ్రీకారం..

**- తొలి రోజు మొత్తం 19గ్రామాల్లో పర్యటన..**



**ఖమ్మం/తల్లాడ మే 18 (అక్షరంన్యూస్)ఖమ్మం రూరల్:** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేరుగా ప్రజల చెంతకే వెళ్లి వారి సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలోని మారెమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రజల వద్దకు వెళతారని తెలిపారు. పల్లెల్లోని నివాసాల వద్ద, ప్రధాన సెంటర్ లో గ్రామస్తులతో సమావేశమై.. సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని దయాకర్ రెడ్డి పేర్కొన్నారు.ఖమ్మం రూరల్ మండలంలోని 19 గ్రామాల్లో తొలిరోజు పర్యటన సాగుతుందని తెలిపారు.

## విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా సరఫరాలో అంతరాయం

**- ఏడిఈ సత్యనారాయణ**

**పెద్దపల్లి టౌన్ మే 18 అక్షరం న్యూస్ :** ఆదివారం రోజున రంగంపల్లి పెద్దపల్లి టౌన్ టు 11 కేవీఏ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా పెద్దపల్లి సాయి గార్డెన్ పల్లవి స్కూల్ సామిల్ సుభాష్ నగర్ కమాన్ రోడ్ డీసెంట్ ఫంక్షన్ హాల్ రోడ్డు కాలేజ్ గ్రౌండ్ వెంకటేశ్వర టెంపుల్ మాతా శిశు హాస్పిటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్తు లైన్లు మరమత్తుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని తెలిపారు విద్యుత్ శాఖ ఏ డి ఈ సత్యనారాయణ.

# ఘనంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు





**రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /మే -18(అక్షరం న్యూస్ ):** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత జయంతి వేడుకలు ముస్తాబాద్ మండల కేంద్రం లోని పోతుగల్ రోడ్ మార్కెట్ లో గల శివాలయం లో వైభవంగా జరిగాయి ఉదయం నుండి మంగళ వాయిద్యాలు సుప్రభాతంతో , విశేష పంచామృతాభిషేకం , క్షీరాభిషేకం , లలిత సహస్రనామ పారాయణము , నిత్యార్చన , నీరాజన మంత్రపుష్పము , సామూహిక కుంకుమార్చన , వంటి కార్యక్రమాలను నిర్వహించారు .ప్రధాన వీధుల్లో ఆర్యవైశ్య మహిళలు. సభ్యులు వాసవి మాత ఉత్సవ విగ్రహం ను పల్లకిలో ఊరేగిస్తూ 101 కలశం లు పట్టుకొని వాసవి మాతను స్మరించుకుంటూ స్థానిక శివ కేశవ ఆలయం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి తీర్థప్రసాదాలు అందించారు ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు కూర బిక్షపతి ఉపాధ్యక్షులు గందె చంద్రం ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీకాంత్ కోశాధికారి బొందుగుల శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు ఉప్పల చంద్రం నార్ల శ్రీనివాస్ కూర నగేష్, అనిల్ కుమార్, శ్రీనివాస్, సంతోష్, నగేష్, స్వందీప్,ఆర్యవైశ్య మహిళలు. సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# వ్యవసాయ కూలీలకు సంక్షేమ పథకాలు అందించాలి

**- జాతీయ కార్యదర్శి బి.వెంకట్.**

**భద్రాద్రి కొత్తగూడెంజిల్లా/కొత్తగూడెం/మే18/అక్షరం న్యూస్ :** వ్యవసాయ కూలీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ పథకాలు అందించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నాడు మచ్చ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల రోజురోజుకీ పేదరికం పెరిగిపోతోందని విమర్శించారు. ఏ ఆధారం లేని నిరుపేదలకు, వ్యవసాయ కూలీలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ పథకాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడం కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. ఉపాధి కూలీలకు రోజుకి 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం, సాగు భూమి లేని నిరుపేదలకు ఇంటి స్థలం, సాగు భూములు పంచాలని, సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పేదల ఓట్లు కొల్లగొట్టి అధికారంలోకి వచ్చే పార్టీలు కార్పొరేట్ లకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తీరు వల్ల దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరుగుతుందని అన్నారు. పేదలకు అండగా వ్యవసాయ కార్మిక సంఘం ఉంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కార్పోరేట్, మతతత్వ బీజేపీని ఓడించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇంచార్జి బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న, ఇండ్లు నిర్మించుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు సాగు దారులకు పెండింగ్ లో ఉన్న పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నిమ్మల వెంకన్న, గడ్డం స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు శెట్టి వినోద, బత్తుల వెంకటేశ్వర్లు, మర్మం చంద్రయ్య, ఆలేటి కిరణ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు మోకాళ్ళ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూజరి సత్యనారాయణ గెలుపు ఖాయం

**-భద్రాద్రిలో మార్మోగిన సన్నాహక సమావేశం...**
**-హాజరైన ఎన్ హెచ్ ఆర్ సి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య,**
**-గెలిపిస్తే పేద ప్రజల రుణం తీర్చుకుంటాను...అభ్యర్థి పూజరి సత్యనారాయణ**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం/మే 18/ అక్షరంన్యూస్ :** వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి పూజారి సత్యనారాయణ ని విద్యావంతులు, మేధావులు 38వ సీరియల్ నంబర్ పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య పట్టభద్రులను కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కేంద్రంలో జిల్లా అధ్యక్షులు మారెల్లివిజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ముఖ్య సమావేశంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పూజరి సత్యనారాయణ తో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రగతి, రాష్ట్ర ప్రగతి కోసం శాసనాల ప్రతిపాదనల కోసం చర్చలు చేయాల్సిన పెద్దల సభకు శాసనమండలికి విద్యావంతులైన మేధావులను పంపాలని ఈ సందర్భంగా విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై పట్టు ఉండి ప్రభుత్వ ఉద్యోగంలో నిష్కల్మషంగా, నిజాయితీగా పనిచేసిన రిటైర్డ్ ఎంఈఓ, సామాజిక ఉద్యమకారులు పూజరి సత్యనారాయణ ని ఓటు అనే ఆయుధం ద్వారా విద్యావంతులు సపోర్ట్ చేసి గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పూజరి సత్యనారాయణ మాట్లాడుతూ తనపై



విశ్వాసం ఉంచి గెలిపించినట్లయితే పేద ప్రజల రుణం తీర్చుకుంటానని, విద్యా ఉద్యోగ పారిశ్రామిక రంగాల్లో ఉన్న లోటుపాట్లను సరిదిద్ది చట్టసభల ద్వారా పేద ప్రజలగొంతునై వినిపిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాజయ్య, రాష్ట్ర సలహాదారులు కృష్ణమోహన్, రాష్ట్ర కార్యదర్శి మాంచాలక్క, గ్రేటర్ వరంగల్ అధ్యక్షురాలు లక్ష్మి, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ యాదవ్, మహబూబాబాద్ జిల్లా మాలోతి వెంకటేష్, ఉపాధ్యక్షులు మారెల్లి విజయకుమార్,జిల్లా కమిటీ సభ్యులు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సామాజిక ఉద్యమకారులు, ఆర్టిఐ కార్యకర్తలు, పలు సామాజిక కుల ప్రజా సంఘాల నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు పెద్ద ఎత్తున పాల్గొని సత్యనారాయణ గెలుపు కోసం పని చేస్తామని సంపూర్ణ మద్దతును ప్రకటించారు.

# బీఆర్ఎస్‌కు షాక్ నెగ్గిన అవిశ్వాసం..









**- నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ వశం**
**- పంతం నెగ్గించుకున్న కాంగ్రెస్ నేతలు**
**- అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ పార్టీ కి మద్దతు తెలిపిన 14 మంది కౌన్సిలర్లు**
**- ఒక కార్పొరేషన్ ఒక మున్సిపాలిటీ హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ**

**రంగారెడ్డి / రాజేంద్రనగర్ / గండిపేట్ / మే 18/ అక్షరం న్యూస్ :** నార్సింగి మున్సిపాలిటీ లోని బిఆర్ ఎస్ పార్టీ చెందిన చైర్మన్, వైస్ చైర్మన్ లను అవిశ్వాస తీర్మానంతో పదవిని కోల్పోయారు. నార్సింగి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసింది. పార్లమెంట్ ఎన్నికల ముందు చైర్మన్ పై అవిశ్వాస తీర్మానాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ ను కోరగా శనివారం అవిశ్వాస తీర్మానానికి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2/3 పైగా కౌన్సిలర్లు అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. మొత్తం 18 మంది కౌన్సిలర్లలో 14 మంది కౌన్సిలర్లు తీర్మానంలో పాల్గొని అవిశ్వాసానికి మద్దతు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ చైర్మన్ గా ఎన్నుకోగా కౌన్సిలర్ విజయ్ బాబుని వైస్ చైర్మన్ గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాడి పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రతి చోట కాంగ్రెస్ పార్టీ జెండా ఉంటుందన్నారు. ఈ నెల 24 బండ్లగూడ జగిర్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేస్తుందని, అలాగే కచ్చితంగా శంషాబాద్ మున్సిపల్, శంషాబాద్ మండల్ లో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుదన్నారు. ఇక నుండి ప్రజలకోసం కాంగ్రెస్ పార్టీ పనిస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, పథకాలను ప్రజలు పొందేవిధంగా చేస్తామన్నారు. అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ.. నూతన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నుకోవడం జరుగుతుందని వివరించారు. తదుపరి చర్యల నిమిత్తం నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్ కు సమర్పించనున్నట్లు ఆర్డీవో వెల్లడించారు. నూతన చైర్మన్ ఎన్నిక కోసం జిల్లా కలెక్టర్ ఎన్నికల కమిషన్ కు నివేదించిన అనంతరం ప్రభుత్వ నిర్ణయం మేరకు చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు. పోలీసులు నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు. సాధారణ ప్రజలతో పాటు ఎవరినీ కార్యాలయంలోకి అనుమతించలేదు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్, కౌన్సిలర్లు మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, ప్రవళిక కిరణ్, అమరేందర్ రెడ్డి, ఉషారాణి, విజయబాబు, శివారెడ్డి, దుర్గేష్, పత్తి ప్రవీణ్, గోపాల సునీత గణేష్, లంకల పద్మ, నరేష్, బిఆర్ ఎస్ పతి శ్రీకాంత్, బిజెపి నుంచి ఇద్దరు ఇండిపెండెంట్ యాదమ్మ నాయకులు దుద్దు కిరణ్, జల్లి వెంకటేష్, కైరం కొండ వినోద్, కైరం కొండ రాము, సాయి, రాజీవ్, పాల్గొన్నారు.